హనీబీఎపి
సంపుటి 3,  సంచిక 3
నవంబర్-డిసెంబర్ 2014

# పల్లెసృజన

గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక

www.pallesrujana.org



## సాంప్రదాయం, సాంకేతికత మేళవించిన రమేష్ ఇన్నోవేషన్



## ఇగ్నైట్ - 2014

బహుమతులు అందుకున్న చిన్నారుల ఆలోచనలు

# బాతుల మధ్య హంసని గుర్తించటం



ఒక కొలను పక్కనున్న తోటలో ఒక బాతు కొన్ని గుడ్లు పెట్టింది. కొంతకాలానికి గుడ్లు పగిలి అందులోంచి చిన్న చిన్న బాతు పిల్లలు బైటకి వచ్చాయి. అందులో ఒక గుడ్డు కొంత పెద్దదిగా వుండటంతో దాని నుండి ఒక పెద్ద బాతుపిల్ల బైటకి వచ్చింది. అప్పుడు బాతు దానితో నువ్వు నా అందరి పిల్లల్లాగా లేవు, వేరుగా వున్నావు, అందునా నువ్వు చాలా అసహ్యంగా వున్నావు అన్నది. ఆ బాతుపిల్లకి ప్రపంచంలోకి రాగానే ఇంత కఠినమైన స్వాగతం లభించటంతో బాధ కలిగింది. తన తోటి అన్నా చెల్లెళ్ల వంక చూసింది. అవికూడా దీన్ని చూసి నవ్వి 'వెళ్ళిపో వెళ్ళిపో నువ్వు అసహ్యమైన బాతుపిల్లవి' అని గేలి చేశాయి. తల్లిబాతు తన తతిమా పిల్లలను తీసుకొని కొలనులోకి ఈతకని వెళ్ళిపోయింది. దీంతో ఆడటానికి ఎవరూ రావటం లేదు, తమలో ఒకదానిగా అంగీకరించటమూ లేదు అని బాధపడి, కుందేళ్ళ దగ్గరికెళ్ళి "మనం ఆడుకుందామా" అని అడిగింది. అవి "నువ్వు వికృతంగా వున్న బాతుపిల్లవి నీతో ఆడుకోముపో" అని చెప్పాయి. ఇలా ఎవరిదగ్గరకెళ్ళినా వాళ్ళు తమలో చేర్చుకోలేదు. అందరూ తమ గుంపులు, అందాలు చూసి గర్వపడుతున్నారే కాని, అంద వికారి అయిన బాతుపిల్లని ఎవ్వరూ చేరదీయలేదు. ఇది మనస్థాపానికి గురై ఎవ్వరూ లేని ప్రదేశానికి వెళ్ళి నీటి కొలనులో ఒంటరిగా ఈదుకుంటూ వెళ్ళిపోయింది.

కాలం మారింది, కొన్ని రోజుల తర్వాత, అది కొన్ని హంసలు దగ్గరలో ఎగురుకుంటూ వెళ్ళటం గమనించి "నేనూ హంసలాగా అందంగా వుండివుంటే ఎంత బావుండేది" అనుకుంది. ఇంతలో ఒక హంస బాతుదగ్గరకు వచ్చింది. "ఇదికూడా తనను ఎగతాళి చేయటానికే వచ్చింది" అనుకుంది బాతుపిల్ల. కానీ, వచ్చిన హంస "మాతో వచ్చి మాలాగే ఎగురు" అని ఆహ్వానించింది. అప్పుడు బాతుపిల్ల నమ్మలేక నీటిలో తన ప్రతిబింబాన్ని తానే చూసుకుంది. అందులో దానికొక అందమైన తెల్లని హంస కనిపించింది. 'బాతు తన అనాకారితనాన్ని ఎంతగా నమ్మిందంటే, తన ప్రతిబింబాన్ని కూడా అంతవరకు నీటిలో చూసుకోలేదు'. అందరూ తనని "అనాకారి... అనాకారి" అన్నవాళ్ళే కాని, తన ఈకలమాటున అందమైన హంసరూపం వుందని ఎవ్వరూ "గుర్తించనీయలేదు".

"తమకేదీ చేతకాదని, జ్ఞానం అనేది తెలివైన వారిసొత్తు అనుకుని బాతు పిల్లలా భావించే హంసలాంటి ఇన్నోవేటర్లకి హనీబీ/ పల్లెసృజనఎప్పుడూ చేయూతనిచ్చి చేరదీసి వెలికి తీయుటకు సహాయ పడతాయి".

- హనీబీ 8(1) 1997

Vol-3, Issue - 3 PALLE SRUJANA Nov.- Dec. 2014

NIF టోల్ ఫ్రీ నెంబర్ 1800 233 5555

# పల్లెసృజన

సంపుటి-3 సంచిక - 3

నవంబర్-డిసెంబర్ 2014

సంపాదకవర్గం

ప్రధాన సంపాదకులు :
బ్రిగేడియర్
పోగుల గణేశం (రిటైర్డ్)

సంపాదకులు :
జమ్ములమడక శశిమోహన్

ఉప సంపాదకులు :
పల్లె వీర రాఘవ రెడ్డి

సలహాదారులు :
డా. కె.ఎల్. రావు
ప్రొ. అనిల్ గుప్త
డా. గీర్వాణి
శ్రీ పి. చంద్రకాంత్ శర్మ
జాగర్లమూడి దుర్గాప్రసాద్
శ్రీమతి అరుణ గణేశం
శ్రీ జమ్ములమడక శ్రీకర్

కార్టూన్లు :
వెంకట్

## ఈ సంచికలో...


- వరి విత్తనాల సాధనాన్ని తయారు చేసిన మేడిపల్లి రమేష్ - 4
- రైతన్న భావం - రైతుల భావ ప్రకటన పోటీలు - 8
- వీధిలైట్లు వృధాగా వెలగకుండా నివారించే ఇన్నోవేషన్ - 9
- 33వ జాతీయ స్థాయి శోధయాత్ర - 12
- అడవి పందులు, ఏనుగుల నుండి పంటల రక్షణ - 16
- బాబీ బేన్ - వందేళ్ళ వనిత - 17
- వివిధ రాష్ట్రాల నుండి సేకరించిన పల్లె జ్ఞానం - 19
- ఇగ్నైట్-14 - 21
- కేన్యా దేశపు ఇన్నోవేటర్ 'లియోనాల్డ్ ముతిసియా' - 27
- జ్ఞానయజ్ఞం - 29
- శౌంఠిగింజల తయారీ - 30
- హనీబీ ప్రగతి - 31
- స్పందన - 32

కవర్ లోపలి పేజీల్లో ....
హనీబీ కథ
రైతులకోసం రైతులు కనిపెట్టిన ఇన్నోవేషన్లు


ఎడిటోరియల్ అడ్రస్ :
పల్లెసృజన, 102,
వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్.
పిన్- 500 094.
ఫోన్ :
040-27111959
98660 01678

E-mail :
editor@pallesrujana.org
www.pallesrujana.org

డి.టి.పి. & డిజైనింగ్ :
నరేంద్ర గ్రాఫిక్స్, హైదరాబాద్.
040- 40029002
81257 99904
E-mail :
narendragrafixhyd@gmail.com

## HoneyBee Regional Collaborators & Publications

**Honey Bee C/o Prof. Anil Gupta**
Indian Institute of Management
Vastrapur, Ahmedabad - 380 015.
Gujarat, India. Ph.: 91-79-26324927, Fax : 91-79-26307341
E-mail : honeybee@sristi.org. http://www.sristi.org

**Aama Akha Pakha (Oriya)**
**Dr. Balaram Sahu,**
3R BP 5/2, BP Colony, Unit-8,
Bhubaneswar-751 012.Orissa.
E-mail : balaram_sahu@hotmail.com

**Hittalagida (Kannada)**
**Dr. T.N. Prakash**
Department of Agricultural Economics,
University of Agricultural Economics,
GKVK, Bangalore-560 065.
E-mail : prakashtnk@yahoo.com

**Num Vali Velanmai (Tamil)**
**P. Vivekanandan,**
SEVA, 45, T.P.M.Nagar,
Virattipathu, Madurai - 625 010.
Tamil Nadu, India.
Phone: 0452 - 238 09 43(O), 0452- 238 36 19 ®
e-mail: vivekseva@gmail.com

**Loksarvani (Gujarati) and**
**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P.O. Box No. 1550.
Ambawadi, Ahmedabad - 380 015.
E-mail : loksarvani@sristi.org
sujhbujh@sristi.org

**Ini Karshakan Samsarikkatte (Malayalam)**
**James T J,**
Peemade Development Society,
Peermade, Idukki-685 531, Kerala.
E-mail : pedes@md2.vsnl.net.in

Printed & Published by **Brig. Pogula Ganesham,** Owner and Printed at **M/s Narendra Graphics,** 1-5-1055/2/14, Flat No. 102, B. Block, Silver Springs Residency, Saibaba Nagar, Old Alwal, Secunderabad - 500 010. Ph.: 81257 99904 and Published at 102, Vayupuri, Sainikpuri Post, Secunderabad-500 094, A.P. Ph.: 040-27118555, Mobile : 098660 01678. Editor Sri J. Sesimohan.

Vol-3, Issue - 3 PALLE SRUJANA Nov.- Dec. 2014

# రసాయన వ్యవసాయాన్ని వదిలిపెట్టేదెలా?

గత యాభై సంవత్సరాల్లో దేశమంతా విస్తరించిన రసాయన వ్యవసాయాన్ని అంతమొందించాలన్న తలంపుతో రైతులు మెల్లమెల్లగా ముందుకు వస్తున్నారు. పంటలు ప్రాణులను బ్రతికించడానికే గాని, చంపటానికి కాదన్న నిజం ఎక్కువమంది రైతులకు అర్థమవుతోంది. పెరిగిపోతున్న వ్యాధులు, వాటి నివారణకయ్యే ఖర్చులు, అనారోగ్యాలు, తగ్గిన ఉత్పాదక శక్తి లాంటి రసాయన వ్యవసాయం లోని దుష్ఫలితాలను గురించి రైతులు ఆలోచించటం శుభపరిణామం.

సేంద్రియ వ్యవసాయం చేపట్టడానికి రైతులు ముందుకు వచ్చినా, సంస్థాగతంగా వారికి ఏవిధమైన ప్రోత్సాహం కాని, సలహాలు కాని లేవు. సేంద్రియ వ్యవసాయంలో ఎంతోమంది రైతులు ఎన్నోరకాల విధానాలు, ప్రక్రియలు, ప్రయోగాలు చేస్తున్నారు. అందరూ తమతమ ప్రయోగాలు విజయవంతమనీ చెప్తున్నారు. దేశవ్యాప్తంగా ఎన్నో సామాజిక సంస్థలు సెమినార్ల ద్వారా, క్షేత్రప్రయోగాల ద్వారా సేంద్రియ వ్యవసాయం చేపట్టడాన్ని ప్రోత్సహిస్నాయి. ఈ విషయంపై అనేక చర్చలు, గ్రంథ రచనలు కూడా కొనసాగుతున్నాయి. శాస్త్రవేత్తలు సైతం వివిధ సెక్టార్లలో సేంద్రియ వ్యవసాయం, బయో పెస్టిసైడ్స్‌లను ఉపయోగించి ఉత్పాదకత పెంపుతో పాటు పెట్టుబడి తగ్గేలా చేయటంలో విజయం సాధిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆకులు, అలములు, పశువులకు సంబంధించిన అనేక విషయాలను ప్రాచీన సంస్కృత గ్రంథాలనుండి సేకరించి, అందరికీ అర్థమయ్యేలా వాటిని అన్ని భాషల్లోకి అనువదించడానికి గట్టి ప్రయత్నాలు జరుగుతున్నాయి. స్వచ్ఛంద సంస్థలతో మమేకమైన వ్యక్తులు పూర్తి దీక్షతో ఇలాంటి కార్యక్రమాలు జరుపుతున్నారు.

అయితే వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, విత్తనాలు, ఎరువులు తయారు చేసే సంస్థలు సేంద్రియ వ్యవసాయంపై ఎక్కువ శ్రద్ధ చూపెట్టడం లేదు. ధనాయస్కాంత ప్రభావంతో వీరు వెలుగును చూడలేక పోతున్నారు. పాశ్చాత్య భావాలకు పూర్తిగా దాసులైపోతున్నారు. మనదేశానికి, మన ప్రజలకు, మన ప్రకృతి వైవిధ్యానికి తగిన వ్యవసాయ పద్ధతులను అర్థం చేసుకోవడం వీరికి కష్టంగా ఉంది. 'సమాజ క్షేమం', 'స్వక్షేమం' అన్న దువిధలో "స్వక్షేమం" వైపే మొగ్గిపోతున్నారు. రసాయనిక ఎరువుల సబ్సిడీ అలాగే ఉంచి, సేంద్రియ వ్యవసాయాన్నీ సమర్థించటంతో ప్రభుత్వం కూడా సందిగ్ధంలో ఉందని తెలుస్తోంది.

ఈ అసందిగ్ధ పరిస్థితు వల్ల రైతులకు నిర్దిష్టమైన మార్గదర్శకత్వం కరువౌతోంది. దేశంలో కొన్ని గ్రామాలు, కొంతమంది రైతులు రసాయన వ్యవసాయాన్ని త్యజించి పూర్తిగా సేంద్రియ వ్యవసాయాన్ని అవలంభిస్తున్నారు. కానీ, వీరికి విశేషజ్ఞుల మార్గదర్శకాలు, విత్తనాలు, సేంద్రియ ఎరువుల తయారీ, సరఫరా, మీ వెనక మేమున్నామన్న భావన, అనువైన సాంకేతిక పరికరాలతో శ్రమను తగ్గించడం లాంటివి పూర్తిగా వారివరకు చేరటంలేదు.

ఒక చిన్న రైతు రసాయన వ్యవసాయ ఖర్చుల ధాటికి తట్టుకోలేక సేంద్రియ వ్యవసాయం చేపట్టాలనుకుంటే అతను ఎక్కడి వెళ్లాలి? ఎవరిని అడగాలి? ఎవరిని నమ్మాలి? ఏది సబబు? మార్గదర్శకత్వం ఏ సంస్థ ఇస్తుంది? సంస్థాగతంగా వచ్చే పోత్రాసహం ఏమిటి?...... ఇలా ఎన్నో ప్రశ్నలకు జవాబు దొరక్క సేంద్రియ వ్యవసాయాన్ని అవలంభించలేకపోతున్నాడు.

ఈ రసాయన వ్యవసాయం చేస్తూ ప్రకృతికి, పశు పక్ష్యాదులకు, మనుషుల ఆరోగ్యాలకు హాని చేస్తూ గడుపుతున్నాం. ఇంతకంటే మూర్ఖత్వం ఏముంటుంది? అన్నింటికి నీదే బాధ్యత అనటంకన్నా, రైతన్నకి సంస్థాగతంగా తోడ్పడే ఏర్పాటు చెయ్యాలి.

రసాయన ఎరువులు తక్షణం మార్చడంతో సేంద్రియ వ్యవసాయం వస్తుందన్న భావనా సరికాదు. సేంద్రియ వ్యవసాయానికి, విత్తనాలు, ఎరువుల తయారీ, సరియైన వ్యవసాయ పరికరాలు, పశువుల ప్రాధాన్యం, అవసరమైన చెట్లు, మొక్కల పెంపకం లాంటి అనేక వ్యవసాయ సంబంధమైన బహుముఖ విశ్లేషణలు, మార్గదర్శకాలు ఎంతో అవసరం. పాఠ్యాంశాలలో, కృషి విజ్ఞాన కేంద్రాల్లో, పరిశోధనా సంస్థల్లో సేంద్రియ వ్యవసాయంపై అవగాహన పెరగాలి. వారి పాత్ర ఈ వ్యవసాయ మార్పిడిలో అధికంగా ఉండాలి.

విజయనగరం జిల్లాలో 'హుద్‌హుద్' తుఫానువల్ల అరటి తోటలు ధ్వంసమయ్యాయి. కాని, అల్లూరి విజయ సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో పెంచిన అరటి తోటకు మాత్రం ఎలాంటి నష్టం కలగలేదంటే నమ్ముతారా? సహజంగా పెంచిన పంటలు ప్రకృతి బీభత్సాలను ఎదుర్కోగలవు అన్న ఈ భావనను శాస్త్రజ్ఞులు విశ్లేషించి రైతాంగానికి అర్థమయ్యేలా తెలియజేయాలి.

ప్రభుత్వాలు సేంద్రియ వ్యవసాయం కొరకు ఒక ప్రత్యేకమైన పాలసీని తయారు చేయాలి. వ్యవసాయ విశ్వ విద్యాలయాల్లో వ్యవసాయ సైంటిస్టులు సేంద్రియ వ్యవసాయంపై ఒక నిర్దిష్టమైన పాత్రను నిర్వహించాలి. విత్తనాలు, ఎరువుల పరిశ్రమలకు మార్గదర్శకాలు తయారు చేయాలి. రాబోయే 15-20 సంవత్సరాల్లో దేశంలో ఎక్కువ సంఖ్యలో రైతులు రసాయనం నుండి సేంద్రియ వ్యవసాయం వైపుకు మళ్ళేలా పకడ్బందీ పాలసీ తయారు చేసి, అన్ని రాష్ట్రాలు అమలు చేసేలాగా ఆదేశాలు ఇవ్వాలి.



ఈ సంచికలో వరంగల్ జిల్లా రైతు రమేష్ సాంప్రదాయాన్ని, సాంకేతికతను మేళవించి సరళంగా విత్తనం వేసే పరికరాన్ని తయారు చేశాడు. పెట్టుబడిని సగానికి తగ్గించే ఈ వ్యవసాయ పద్ధతిని రైతులు విరివిగా వాడేలా చేయటంలో మనందరి ప్రమేయం ఎంతో అవసరం.

వ్యవసాయానికి సంబంధించిన ముఖ్య విషయాలపై, నూతన సాంకేతిక ఆవిష్కరణలపై, ప్రభుత్వ వ్యవసాయ పాలసీలు-విధానాలపై రైతుల నిష్పక్ష మనోభావాలను సేకరించడానికి ప్రస్తుతం ఏ వేదికా లేదు. 'పల్లెసృజన' ఈ లోటును తీర్చడానికి ప్రయత్నిస్తోంది. రైతులు మాత్రమే పాల్గొనే "రైతన్న భావం" పోటీ గురించి ఈ సంచికలో ప్రచురించాం. వచ్చే ఉగాదికి ఉత్తమమైన వాటికి పారితోషికాలు ఇవ్వాలని నిర్ణయించాం. పాఠకులు, పాఠకేతరులు ఈ పోటీలో పాల్గొని, ఈ వినూత్న వేదికను ఉత్సాహంగా వినియోగించుకోవాలని కోరుకుంటున్నాము.

భవదీయ

బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం



ఈ చిన్ని ఆలోచన
చాలామందికి చాలా రకాలుగా
వచ్చి వుండొచ్చు!
ఇంతేనా!!
అని
ఈ ఆలోచనని విస్మరించగలమా?

# చిన్ని ఆలోచన ?

ఓ చిన్ని ఆలోచన చాలదా?

**Honey Bee Network**

కొన్ని ఆలోచనలు 'చాలా చిన్నవి'గా వుంటాయి. కానీ ఈ ఆలోచనలు అందరికీ తట్టవు. ఎవరైనా ఏదైనా ఇన్నోవేషన్ చేసిన తర్వాత దాన్ని చూసి "ఇంతేనా" అని అంటాం. ఇదంతా తమకు తెలుసు అనుకుంటాం. కానీ ఆ ఆలోచన "నేనెందుకు చెయ్యలేదు" అని మాత్రం అనుకోము. కొన్ని చిన్న ఆలోచనలే 'పరిష్కారాన్ని సులభతరం చేస్తాయి'. ఆలోచన చిన్నదే కావచ్చు! కానీ దానినుండి లభించే ఫలితాన్ని బేరీజు వేయండి!! ఆలోచన అద్భుతం అనిపిస్తుంది కదూ!!!

**కాబట్టి "సింపుల్" అని కొట్టి పారేయకండి.**

**సరళమైన పరిష్కారాలే దేశానికి అత్యంత ఉపయోగకరంగా ఉంటాయి. వాటిని గుర్తించండి, గౌరవించండి, గెలిపించండి.**



# సాంప్రదాయం, సాంకేతికతల మేళవింపుతో వరి విత్తనాల సాధనాన్ని తయారు చేసిన మేడిపల్లి రమేష్

రైతులు సాధారణంగా వేరుశనగ, శనగ, కొర్ర, జొన్న, వరి లాంటి విత్తనాలను వేసేందుకు 4 లేదా 6 చెక్కల గొర్రుతో వేస్తారు. ఆ గొర్రుకు 'జడిగం' అని పిలువబడే ఒక సాధనం అమర్చబడి వుంటుంది. ఒక వ్యక్తి ఎద్దులను సరియైన సాలులో తోలుతూ వుంటే గొర్రుకి అమర్చిన జడిగంలో మరో వ్యక్తి విత్తనాలను సమపాళ్ళలో వేస్తూ వుంటాడు. ఇది కొంత నైపుణ్యంతో కూడిన పని అని అనుభవజ్ఞులందరికీ తెలుసు. ఎందుకంటే ప్రతి రైతూ జడిగం ద్వారా విత్తనాన్ని వేయలేడు. ఇందుకు తగిన నేర్పు, శిక్షణ వున్నవారు మాత్రమే విత్తనం వేయగలరు.

అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఇలాంటి నైపుణ్యం కలిగిన వ్యక్తులు గ్రామాల్లో దాదాపు కనుమరుగై పోతున్నారు. సాధారణంగా ప్రతి గ్రామంలో జడిగం ద్వారా విత్తనాన్ని వేయగలిగినవారు 5 నుండి 10 మంది వ్యక్తులు మాత్రమే మిగిలారు.

అలాగే కొన్ని ప్రాంతాలలో వరిని కూడా వర్షం పడిన వెంటనే పొలంలో విత్తనం వేసి వర్షాధార పంటగా కూడా పండిస్తున్నారు. దీన్ని కొందరు రైతులు దమ్ము చేసిన భూముల్లో ఇంకొద్ది రోజుల్లో వర్షం వస్తుంది అనే సూచనను గమనించి ముందుగా విత్తనం వేస్తారు. విత్తనాన్ని ప్రధానంగా జులై నెల మొదటి పదిహేను రోజుల్లో విత్తుతారు. మరి కొందరు వర్షం వచ్చిన రోజు రాత్రి వడ్లను నీటిలో నానబెట్టి మరునాడు గొర్రు ద్వారా విత్తనం వేస్తారు. మరి కొందరు వరి నారును నాటడం ద్వారా వడ్లను పండిస్తారు.

మెట్ట భూమిలో విత్తనం ఎలా వేసినా గొర్రు తోలటానికి ఒక వ్యక్తి, విత్తనం వేయటానికి మరో వ్యక్తి అవసరం. ఇటువంటి పరిస్థితుల్లో నిపుణుడైన విత్తనం వేసే కూలీ దొరకక రైతు ఇబ్బందుల పాలవుతున్నాడు. అంతేగాక ఆ నిపుణుడైన వ్యక్తి వేతనాన్ని భరించే శక్తి కూడా కొందరు రైతులకు వుండటం లేదు. ఇవన్నీ రైతుల పెట్టుబడి ఖర్చులను పెంచుతాయి.

ఈ సమస్యలకు పరిష్కారంగా వరంగల్ జిల్లా గోవిందరావుపేట మండలం, తల్వాయి గ్రామానికి చెందిన మేడిపల్లి పెద్ద అయిలయ్య, కనకమ్మ ల తనయుడు మేడిపల్లి రమేష్ ఒక సులువైన పరికరాన్ని కనుగొన్నాడు. ఈ పరికరం ప్రతి చిన్న, సన్నకార రైతుకు అందుబాటు ఖరీదులో వుంటుంది. అంతేకాక, ఇటువంటి పరికరం గ్రామానికి ఒకటి లేదా రెండు వుంటేచాలు ఇక ఆ గ్రామంలో ఏ రైతు విత్తనం వేసుకోవాలన్నా ఇబ్బందులు వుండవు.

**పరికరాన్ని గూర్చిన వివరాలు:**

ఎప్పుడూ రైతు శ్రమను తగ్గించాలని ఆలోచించే



రమేష్ ఈ గొర్రును, జడిగంను తయారు చేయడంలో అన్ని రకాలుగా ఆలోచించి దానిలోని లోటుపాట్లను సవరించి "గొర్రు–జడిగం" తయారు చేశాడు. ఈ పరికరంలో గొర్రు 5 చెక్కలను కలిగి వుంటుంది. అందులో ముందు భాగంలో రెండు, వెనక భాగంలో మూడు వుంటాయి. అయితే ఈ చెక్కల (కొయ్యల) మధ్య సమాన దూరం వుండేలా కొలతలను నియంత్రించాడు. దానికి అనుసంధానంగా జడిగాన్ని ఏర్పాటు చేసి దానిపైన విత్తనాలను నిలువచేసే ఒక ట్యాంకును ఏర్పాటు చేశాడు. ఈ ట్యాంకునుండి సరియైన మోతాదులో విత్తనాలను 5 వరుసలకు సమానంగా అందించేలా, దున్నేటప్పుడు గొర్రుకు అమర్చిన చక్రాలతో, ట్యాంకునకు సైకిల్ చైన్‌తో అనుసంధానం చేసి విత్తన మోతాదును నియంత్రించాడు. తద్వారా ఒకే వ్యక్తి జడిగం పైనున్న ట్యాంకులో 4 కిలోల వడ్లగింజలను నింపుకొని రెండు పొలాన్ని పశువులతో దున్నుతుంటే గొర్రు కదలికల వల్ల విత్తనాలు జడిగం లోకి చొరబడతాయి. అందువల్ల గొర్రులోని 5 వరుసలలో(సాళ్ళలో) సమాన మోతాదులో భూమిలోకి విత్తనం పడుతుంది.

దీన్ని తయారు చేయటంలో ముందుగా రమేష్ విత్తనం వేయాలనుకున్నప్పుడు ఆ విత్తనం భూమిలో ఎక్కువ లోతులో పడకూడదు అనుకుని, దానివల్ల ఎక్కువ లోతునుండి విత్తనం మొలకెత్తే అవకాశాలు చాలా తక్కువ అని ఆలోచించి గొర్రు ఎక్కువ లోతు దున్నకుండా ఆ గొర్రుకు కర్ర చక్రాలను అమర్చాడు. వాటికి సైకిల్ చక్రాలకుండే చైన్ స్ప్రాకెట్లను, చైన్‌ను ఏర్పాటు చేశాడు చక్రం తిరుగుతున్న వేగాన్ని బట్టి చైను కూడా తిరుగుతూ డ్రమ్ముకు ఏర్పాటు చేసిన ఒక విడి భాగాన్ని కదల్చటం ద్వారా విత్తనం క్రిందకు రాలుతూ గొర్రులోని 5 భాగాలకు సమానంగా విత్తనాన్ని అందిస్తుంది.

ఈ పరికరం రోజుకు సునాయాసంగా 3–4 ఎకరాలలో విత్తనం వేయగలదు. 5 సాళ్ళు, 45 అంగుళాల మేర వెడల్పులో విత్తనాలు పడతాయి. విత్తనాలు వర్షాకాలంలో వేయడం వలన, వర్షాధారంగా ఏ నీటిపారుదల లేకుండా వరి పండుతుంది. పిలకలు ఎక్కువగా రావడం వల్ల విత్తనాల పద్ధతిలో దిగుబడి ఎకరాకు 30–35సంచులు వచ్చిందని, ఇది నారు పద్ధతికంటే ఎక్కువగా ఉందని రమేష్ అన్నారు. ఈ పద్ధతిలో రైతుకు ప్రతి ఎకరానికి దమ్ము ఖర్చులు, నారుపోసే ఖర్చులు, నారు వేసే ఖర్చులు లాంటివన్నీ కలిసి ఎకరాకు దాదాపు 5 వేలదాకా మిగులుబాటు అవుతుంది అన్నారు. అంతేగాక ఎకరాకి వెయ్యి రూపాయల ఎరువులు తక్కువగా వాడటం జరుగుతుంది. ఈవిధంగా విత్తనాల పద్ధతిలో ఎకరం వరి పొలానికి ఖర్చు అయిదు వేలు తగ్గుతుంది. ఈవిధంగా రైతు పెట్టుబడి సగం తగ్గడం, పంటలో ఏవిధమైన తగ్గుబాటు లేకపోవడం, నీటికై, కరెంటుకై ఆపసోపాలు పడకుండా సరియైన పంటను పండించగల వినూత్న పద్ధతి, పరికరం రమేష్ చేయడం రైతుల పాలిట వరం.

రమేష్ చేసిన ఈ గొర్రు ఆ గ్రామంలోని చాలా మంది రైతులను ఆకట్టుకుంది. రమేష్ పంటను గమనించిన కొందరు రైతులు ఇతని పరికరం సహాయంతో విత్తనాలను వేసుకోవటం జరిగింది. గతంలో గొర్రుతో వేసిన వరి విత్తనం ద్వారా పండించిన పంటకన్నా అధిక దిగుబడి వచ్చింది. ఇది గమనించిన రైతులు ఇదేదో చాలా బావుందని తెలుసుకుని ఈ సంవత్సరం ఇంకొందరు రైతులు దాదాపు 25 ఎకరాల్లో





ఈ పరికం సహాయంతో విత్తుకున్నారు. రాబోయే సంవత్సరం ఈ పరికరంతో విత్తనం వేసే రైతులు ఇంకా పెరిగే అవకాశం వుంది. ఈ పరికరం సామర్థ్యాన్ని ప్రత్యక్షంగా చూసిన ఆ గ్రామ సర్పంచ్, జిల్లా వ్యవసాయ అధికారులు, రైతులు కూడా రమేష్‌ను అభినందించి సన్మానం కూడా చేయటం జరిగింది.

ఈ పరికరాన్ని రమేష్ తన ఇంట్లో నిరుపయోగంగా వున్న సామాగ్రితో తయారు చేసి విజయం సాధించడం చెప్పుకోదగ్గ విషయం. ఈ సాధనాన్ని కొత్తగా తయారు చేయాలంటే దాదాపు 6 నుండి 7 వేల వరకు ఖర్చవుతుందని అంటున్నాడు. ఎవరైనా రైతులు కావాలంటే తాను తయారు చేయించి పంపగలనని అంటున్నాడు. ప్రస్తుతం వ్యవసాయానికి ఎద్దులు కూడా కరువౌతున్న తరుణంలో దీన్ని యంత్రీకరించి చిన్నకారు రైతుకు అందుబాటులో వుండేలా తయారు చేయాలనే ఆలోచనలో వున్నాడు రమేష్. ఇది ఎలా తయారు చేయాలన్న ఆలోచనైతే వున్నది కానీ, అందుకు అవసరమైన నిధులు తనవద్ద లేవని ఎవరైనా ఆర్థిక సహకారం అందిస్తే తయారు చేయగలనని ఆత్మవిశ్వాసంతో అంటున్నాడు రమేష్.

ప్రస్తుతం తయారు చేసిన ఈ పరికరానికి కూడా అదనంగా మరో ట్యాంకును అమర్చితే ఒకేసారి ఎరువు, విత్తనాలను వేసే అవకాశం కూడా వుంటుందని ఆలోచిస్తున్నాడు. ప్రస్తుతం ఈ సీడ్ డిస్ట్రిబ్యూటర్ వరికి మాత్రమే పని చేస్తుందని కొద్దిపాటి మార్పులతో దీన్ని వేరుశనగ, శనగ తదితర అన్ని రకాల విత్తనాలు వేయటానికి వాడుకోవచ్చు అంటున్నాడు.

స్వతహాగా సృజనాత్మక కలిగిన రమేష్‌ను ఆ ప్రాంత విశ్రాంత వ్యవసాయ అధికారి శ్రీ నాగభూషణం గారు గుర్తించి ఇతను తయారు చేసిన పరికరం విశిష్ఠమైనదని తనకు అనిపించటంతో రమేష్‌ను అతని పరికరంతో సహా వ్యవసాయ ఉన్నతాధికారులకు, 'పల్లెసృజన'కు పరిచయం చేయడం వల్ల రమేష్ సృజనాత్మకత వెలుగులోకి వచ్చింది. తనకోసం తయారు చేసుకున్న పరికరాన్ని నాగభూషణం గారు గుర్తించి, దాన్ని వెలుగులోకి తీసుకు రావటానికి సహకరించినందుకు వారికి కృతజ్ఞతలు తెలియ జేసుకున్నాడు రమేష్.

ఈ విషయంలో నాగభూషణం గారు స్పందిస్తూ. తాను స్వతహాగా రైతు కుటుంబం నుంచి వచ్చినవాడినని, పైగా రైతుకు సంబంధించిన శాఖలోనే ఉద్యోగం రావటంతో ఎంతోమంది రైతులకు సేవ చేసే అవకాశం లభించటం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. రమేష్ లాంటి సృజనాత్మక రైతులను ఎంతోమందిని తన సర్వీసులో చూశానని, 'పల్లెసృజన' గురించి ఇటీవలే తనకు తెలియటంతో రమేష్‌ను పల్లెసృజన ద్వారా వెలుగులోకి తీసుకు రావాలన్న ఉద్దేశ్యంతో పరిచయం చేశానని, సరియైన ప్రోత్సాహం అందిస్తే ఎన్నో ఇన్నోవేషన్లను చేసే ఆలోచనా శక్తి వుందని రమేష్‌ను అభినందించారు.

రమేష్‌కు రైతుపరంగా ఈ పరికరమే కాక ఇంకా ఎన్నో సృజనాత్మక ఆలోచనలు అతని మదిలో మెదలు తున్నాయి. వాటిలో కొన్నింటిని తానే స్వయంగా ఆచరణలో పెట్టి విజయం సాధించాడు కూడా. అందులో 'వాటర్ సేవర్' ఒక ఆలోచన.

గతంలో 'పల్లెసృజన'లో పందిరి పుల్లారెడ్డి 'రెండు బోర్లకు ఒకే మోటర్' గురించి పాఠకులకు గుర్తుండే వుంటుంది. అలాంటి ఆలోచనే కానీ, రమేష్‌ది మరోలా



వుంటుంది. అదేమిటంటే.... కొందరు రైతులకు బోర్లో ఊట తక్కువగా వుంటుంది. వారికి అస్తమానమూ తమ పొలానికి నీరు అవసరం వుండదు. అలా నీరు పొలానికి అవసరం లేని సమయంలో బోరుబావి పక్కనే నీటి గుంట (ఫాం పాండ్)ని త్రవ్వుకుని అందులోకి నీళ్ళు వదులుకుంటూ వుండాలి. పొలానికి అవసరమైనప్పుడు ఈ ఫాంపాండ్‌లోని నీరు, బోరులోని నీరు ఒకేసారి పంపింగ్ చేసే సదుపాయాన్ని కనుగొన్నాడు. దీనివల్ల బోరులో నీరు అయిపోతుందన్న బెంగ రైతుకు ఉండదు. ఎందువల్లనంటే ఫాం పాండ్ లోని నీటినుండి ఒక పైపును బోరుబావినుండి బైటకు వచ్చిన పైపుతో అనుసంధానం చేస్తాడు. ఈ రెండు పైపులు అనుసంధానం చేసిన తర్వాత కొద్ది దూరంలో ఆ పైపుకు గాలి వదలటానికి ఒక చిన్న పైపును ఏర్పాటు చేశాడు.

ఇతనికి ఈ ఆలోచన 10 సంవత్సరాల క్రితమే వచ్చిన వెంటనే తన పొలంలో ఏర్పాటు చేసుకున్నాడు. తాను అప్పట్లో తన పొలంలో మిరపకాయ వేసేవాడు. అప్పుడు తనకు రెండు బోర్లు వున్నా వాటిలో ఒక్కోదాంట్లో ఒకటింపావు అంగుళాల నీరు మాత్రమే వుండేది. పొలానికి నీరు కడుతుండగా బోర్లో నీరు అయిపోయి కొద్దిసేపు మోటారును ఆపేసి మళ్ళీ స్టార్ట్ చేయాల్సి వచ్చేది. ఇలా చేస్తూ విసుగు చెందిన రమేష్ దీనికి ఉపాయం ఆలోచించాలని తనకున్న పరిజ్ఞానంతో ఈ ఉపాయాన్ని కనుగొన్నాడు.

ఇవే గాక కరెంటు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గానీ, రైతు మోటారువద్దనున్న ఫ్యూజు పోయిన వెంటనే సైరన్ మోగి రైతు గుర్తించేలా ఓ పరికరాన్ని కనుగొన్నాడు. అలాగే కొన్ని బోరు బావుల్లో చాలా రోజులపాటు మోటారును ఆడించకపోతే మట్టి పేరుకుపోయి మోటారు స్టార్ట్ కావడం





కష్టం. అలాంటప్పుడు మోటార్‌ను నాలుగు లేదా ఐదు సార్లు ఆన్ చేసి వెంటనే ఆఫ్ చేయటం ద్వారా మోటార్ పైన పేరుకున్న మట్టి వదులై ఆ తర్వాత మోటార్ ఆడుతుంది. దీనికి పరిష్కారంగా మోటార్ సైకిళ్ళ సైడ్ ఇండికేటర్‌కు వినియోగించే పరికరాన్ని స్టార్టర్‌కు అనుసంధానం చేయటం ద్వారా ఈ సమస్యను పరిష్కరించాడు రమేష్.

ఇలా ఎన్నో రకాలుగా రైతుకు, ముఖ్యంగా సన్నకారు రైతులకు లాభం చేకూర్చే అనేక ఆలోచనలు కలిగి, పరిష్కార మార్గాలు కూడా చూపించిన ఆదర్శ రైతు రమేష్. పొలాలకు ఎలాంటి నీటి సమస్య వున్నా తనను సంప్రదిస్తే దానికి తప్పక సహాయం చేస్తానని అంటున్నాడు. ఇంత ఆత్మవిశ్వాసంతో వున్న రమేష్ 2013-14 సంవత్సరానికి ఉత్తమ రైతు పురస్కారాన్ని కూడా అందుకున్నాడు. 'పల్లెసృజన' రమేష్ ఇన్నోవేషన్ ఎద్దులతో నడిచే విత్తనం వేసే పరికరం (జడిగం మరియు గొర్రు) పేటెంటుకు, ఎన్.ఐ.ఎఫ్. అవార్డుకు సిఫారసు చేసే ప్రక్రియ ప్రారంభించింది.

**రమేష్ లాంటి సృజనాత్మక రైతులను మనం సాదరంగా గౌరవించి ఆయన జ్ఞానాన్ని పల్లెపల్లెకు చేరవేయాలి. "వినూత్న జడిగం" సమస్త సన్నకారు రైతులకు చేరాలి. రమేష్ అనుభవించిన లాభాలను ప్రతి సన్నకారు రైతు స్వానుభవానికి తెచ్చుకోవాలి. ఇది సమాజ బాధ్యత.**

**- ఎడిటర్**

**ఇన్నోవేటర్ చిరునామా:**
**మేడిపల్లి రమేష్, తల్వాయి గ్రామం, గోవిందరావుపేట మండలం, వరంగల్ జిల్లా. ఫోన్ : 84669 33668.**



పల్లెసృజన 'మన్మథనామ సంవత్సర' ఉగాది సందర్భంగా

# రైతన్న భావం

## రైతుల భావ ప్రకటన పోటీలు



*ఈ పోటీ పాఠశాల, కళాశాల విద్యార్థులకి కాదు!*
*మొట్టమొదటిసారి కేవలం పొలాల్లో స్వయంగా కష్టించి, పంట పండించే కృషీవలులకై ప్రత్యేకించి ఈ పోటీ నిర్వహించాలని 'పల్లెసృజన' నిర్ణయించింది.*

మన్మథ నామ సంవత్సర ఉగాది (21 మార్చి, 2015) 'పల్లెసృజన' "భావ ప్రకటన పోటీలు" నిర్వహిస్తోంది. రైతులకి వారి పొలాలే వారికి కర్మభూమి, అవే వారి ప్రయోగశాలలు. దాన్లో ప్రయోగాలు చేసే రైతులే శాస్త్రవేత్తలు. మీరు మీ పొలాలలో చేసిన ప్రయోగాలు, ఆ అనుభవాలు, వాటి ఫలితాలు మీకే సొంతం కాకుండా, వాటిని నలుగురికీ చెప్పుకునేందుకు, ప్రభుత్వ శాస్త్రజ్ఞుల, పారిశ్రామిక వ్యవస్థల ప్రభావం మీ జీవనశైలిపై మీ వృత్తి వ్యవహారాలపై ఎలావుందో, వాటి పర్యవసానాలు ఏమిటో మీ మనసులో మాటలు చెప్పుకోవడానికి ఇదో అవకాశం. నలుగురికీ మేలు చేయటంతో పాటు మీకూ గుర్తింపు/ బహుమానం గెలుచుకునే సదవకాశం 'పల్లెసృజన' కల్పిస్తోంది.

**అంశం:**

**"ప్రకృతి రక్షణకు, సమస్థ జీవ క్షేమానికి సేంద్రియ వ్యవసాయం చేపట్టక తప్పదని అందరికీ అర్థమైంది. రసాయనాల నుండి సేంద్రియానికి వ్యవసాయ మార్పిడి ఎలా చేయాలన్నది అయోమయంగా ఉంది. ఈ నేపథ్యంలో సేంద్రియ వ్యవసాయం ప్రాచుర్యం పొందాలంటే ఏమి చేయాలి? ప్రభుత్వపరంగా, ప్రభుత్వేతరంగా చేపట్టవలసిన కార్యక్రమాలు ఏమిటి? రైతుల పాత్రమ ఏమిటి?"**

**నిబంధనలు:**

1 స్వయంగా వ్యవసాయం చేస్తున్న రైతులు మాత్రమే ఈ పోటీలో పాల్గొనటానికి అర్హులు.

2 మీరు స్వయంగా కాని, మీరు చెప్తుంటే ఇంకెవరైనా కాని వ్రాసి పంపించవచ్చు.

3. వ్యాసం తెలుగులో మాత్రమే వ్రాయాలి. 6 పేజీలకు మించకుండా ఉండాలి.

4. మీ పేరు, చిరునామా, ఫోన్ నెంబరు, ఫొటో పంపండి.

5. మీ వ్యాసానికి సంబంధించిన విషయంపై ఫొటోలు ఏవైనా వుంటే వాటిని కూడా జతచేయవచ్చు.

6. మీ వ్యాసాలు ఈ-మెయిల్‌లో కాని, పోస్టులో కాని పల్లెసృజన కార్యాలయానికి పంపండి.

7. మీ భావాలు మాకు చేరవలసిన ఆఖరు తేది **28 ఫిబ్రవరి, 2015**.

**బహుమతుల వివరాలు:**

❀ మొదటి బహుమతి రూ. 1,116/-లు + 3 సంవత్సరాల 'పల్లెసృజన' పంపబడుతుంది.

❀ రెండవ బహుమతి రూ. 750/-లు + 2 సంవత్సరాలు 'పల్లెసృజన' పంపబడుతుంది.

❀ మూడవ బహుమతి రూ. 500/-లు + ఒక సంవత్సరం 'పల్లెసృజన' పంపబడుతుంది.

❀ నాల్గవ బసుమతి రెండు వ్యాసాలకు ప్రోత్సాహకంగా ఒక సంవత్సరం 'పల్లెసృజన' పంపబడుతుంది.

❀ పోటీలో పాల్గొన్న వారందరికీ 3 'పల్లెసృజన' పత్రికలు ప్రోత్సాహకరంగా పంపడం జరుగుతుంది.

ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మీ భావాల్ని నలుగురికీ చేరవేయాలన్న మా ఈ ప్రయత్నంలో పాల్గొని దిగ్విజయం చేస్తారని ఆశిస్తున్నాము. **- ఎడిటర్.**

**మీ వ్యాసాలు పంపాల్సిన చిరునామా :**

**ఉగాది రైతన్న భావం పోటీలు,**
**పల్లెసృజన, 67, వాయుపురి, సైనిక్‌పురి పోస్టు,**
**సికింద్రాబాద్ - 500 094.**
ఇ-మెయిల్ : editor@pallesrujana.org

ఆఖరు తేది **28 ఫిబ్రవరి, 2015**.

# వీధిలైట్లు వృధాగా వెలగకుండా నివారించే ఇన్నోవేషన్



చాలా నగరాల్లో, గ్రామాల్లో తెల్లవారి మిట్ట మధ్యాహ్నం అయినా కూడా వీధిలైట్లు వెలుగుతునే వుండటం మనం చూస్తూనే వుంటాం. దీనివల్ల ఎంత విద్యుత్తు వృధా అవుతుందో అందరికీ తెలిసిందే. ఒకానొకప్పుడు చంద్రబాబు నాయుడు మొట్టమొదట అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని రోజులకు తన ప్రభుత్వ పనితీరును గమనించేందుకు వీధిలో తిరుగుతూ రోడ్డున పోయే ఒక వ్యక్తిని ఆపి "మా ప్రభుత్వ పనితీరు ఎలావుంది" అని అడిగితే అతను వెంటనే "ఇదిగో ఇలా వుంది" అంటూ పగలే వెలుగుతున్న వీధిలైట్లను చూపించాడట! అప్పుడు ఆ వ్యక్తి సమాధానానికి ఖిన్నుడైన చంద్రబాబు వెంటనే ఆ ప్రాంతానికి సంబంధించిన విద్యుత్తు అధికారిని సస్పెండ్ చేయడం జరిగిందట.

ఇలాంటి సంఘటనలు చాలా గ్రామాల్లో పట్టణాల్లో గమనించే వుంటారు. ఇందువల్ల కొన్ని లక్షల రూపాయల ప్రజాధనం వృధా అవుతోంది. ఈ సమస్యకు ఎందరో ఇంజనీర్లు చూపలేని పరిష్కారాన్ని ముప్పారపు రాజు చేసి చూపించాడు. వరంగల్ జిల్లా, దుగ్గొండి మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన ముప్పారపు రాజు పల్లెసృజన పాఠకులకు పరిచయమే.

వీధిలైట్లు తెల్లవారితే వాటంతట అవే ఆఫ్ అయ్యేలా, రాత్రయితే వాటంతట అవే వెలిగేలా "ఆటోమేటిక్ స్ట్రీట్ లైట్ కంట్రోల్ సిస్టం" అనే పరికరాన్ని తయారు చేశాడు. ముప్పారపు రాజు ప్రస్తుతం వరంగల్ జిల్లాలో 'పల్లెసృజన' స్కౌట్‌గా పనిచేస్తున్నాడు.

ప్రభుత్వం ఒకవైపు విద్యుత్‌ను పొదుపు చేయండి అని అంటున్నా, కొన్ని గ్రామాల్లోని వీధిలైట్లు పగలనకా, రేయనకా వెలుగుతూనే వుండి ఎంతో విద్యుత్తును వృధా చేస్తున్నాయి. ఇదంతా గమనించిన రాజు ట్రాన్స్‌కో అధికారులను కలిసి వీధిలైట్లు పగలు కూడా వెలుగుతున్న

**సాంప్రదాయ జ్ఞానం ఆధునిక విజ్ఞానం కలిసి వుండటం సాధ్యమేనా?**

విషయాన్ని తెలియజేస్తే తాము సర్పంచ్‌లకు ఆన్–ఆఫ్ స్విచ్‌లను పెట్టమని చెప్పామని ఇంకా కొన్ని గ్రామాల్లో వీధిలైట్లకు ప్రత్యేక విద్యుత్ లైను లేదని తెలుపుతూ, వీధిలైట్లకై ఒక యూనిట్ కరెంటుకు రూ. 5–30పై. వసూలు చేస్తామని చెప్పారు. 100కు పైగా లైట్లున్న ఒక గ్రామంలో పగలు రెండు గంటలు వెలిగినా కనీసం 10 యూనిట్ల కరెంటు వృధా అవుతుందని అన్నారు.

ఇదంతా సర్వే చేసి ఒక దుగ్గొండి మండలంలోనే సుమారుగా సంవత్సరానికి 8 లక్షల రూపాయలకు పైగా విద్యుత్ వృధా అవుతుందని అంచనా వేశాడు. ఇక జిల్లా వ్యాప్తంగా అయితే లక్షల రూపాయల్లో విద్యుత్ వృధా అవుతుంది. ఈ సమస్యకు ఎలాగైనా పరిష్కారం చేయాలనుకున్నాడు రాజు. 2013 నవంబర్ నెలలో ఎన్.ఐ.ఆర్.డి.లో బ్రిగేడియర్ గణేశం గారికి ఈ సమస్యను విన్నవించి, దానికి పరిష్కారంగా స్ట్రీట్‌లైట్ కంట్రోల్ అనే పరికం తయారు చేస్తున్నాను అని చెప్పాడు. వెంటనే గణేశం గారు అభినందించి, ఆశీర్వదించారు.

మొట్టమొదటిసారిగా 'గిర్నిబావి' అనే గ్రామంలో



10 లైట్లకు కలిపి ఒక పరికరం అమర్చాడు. దాన్ని 6 నెలల పాటు పరిశీలనలో వుంచాడు. ఈ పరికరం అమర్చిన తర్వాత గిర్నిబావి గ్రామంలో వీధిలైట్లు రోజూ చీకటి కాగానే వెలుగుతూ, మళ్ళీ తెల్లవారగానే వాటంతట అవే ఆరిపోవటం గమనించిన విద్యుత్ అధికారులు ఇది చాలా మంచి పరికరం అని రాజును అభినందించి, ఈ పరికరాన్ని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసేలా సహకరిస్తామన్నారు.

రాజు చేసిన పరికరం గురించి కొందరు పత్రికా విలేఖరులు ఆ ప్రాంత విద్యుత్ అధికారి దానయ్యతో మాట్లాడినప్పుడు అతను "రాజు తయారు చేసిన ఈ పరికరం ఆలోచన చాలా బావుందని, ఇలాంటి పరికరాలను అన్ని గ్రామాల ప్రజలు అమర్చుకుంటే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంద"ని ఉటంకించారు. "నేను స్వయంగా ఆ పరికరాన్ని పరిశీలించి అతన్ని అభినందించాను. 6 నెలలుగా గ్రామంలోని 10 వీధిలైట్లు చక్కగా సకాలంలో ఆఫ్ అవుతూ, చీకటి కాగానే వెలుగుతూ వున్నాయి" అని ఎ.ఇ.ఇ. శ్రీధర్ కూడా రాజును అభినందించారు. ఒక్కో పరికరం 10 ట్యూబ్‌లైట్లను లేదా 20 సిఎఫ్ఎల్ బల్బులను కంట్రోల్ చెయ్యగలదని రాజు అన్నాడు.

ఇప్పటివరకు రాజు తయారు చేసిన ఈ పరికరాలను తన మండలంలోని గిర్నిబావి, గోపాలపురం, తొగర్రాయి, కొమ్మాల గ్రామాల్లో విజయవంతంగా పనిచేస్తున్నాయి. ఈ పరికరాన్ని మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు ప్రొఫెసర్ సీతారాం నాయక్ గుర్తించి దుగ్గొండి మండలంలోని అన్ని గ్రామాల్లో అమర్చడానికి ప్రతి గ్రామ పంచాయితీకి రూ. 5000 మంజూరు చేస్తున్నట్లు ప్రకటించాడు. తాను ముఖ్యమంత్రితో మాట్లాడి ఈ పరికరాన్ని జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేయిస్తానని హామీ కూడా ఇచ్చారు.

ప్రతి గ్రామంలో ఈ పరికరం అమర్చితే ఎంతో విద్యుత్‌ను ఆదా చేయవచ్చు. ఇక పట్టణాలు, జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా లెక్కిస్తే కొన్ని లక్షల యూనిట్ల విద్యుత్‌ను ఆదా చేయవచ్చు అంటాడు ముప్పారపు రాజు.

ఈ పరికరం కావాలనుకున్న వారు ఇన్నోవేటర్ **ముప్పారపు రాజు ఫోన్ నెం. : 9885935482** కు సంప్రదించి పొందవచ్చు.

# నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్-ఇండియా

భారత ప్రభుత్వ శాస్త్ర మరియు సాంకేతిక విభాగం

NIF-INDIA

DST

## గ్రామీణ స్థాయిలో ఏ సహాయమూ లేని సాంకేతిక ఆవిష్కరణలు (ఇన్నోవేషన్లు) మరియు సాంప్రదాయ పరిజ్ఞానాన్ని శోధించే

# జాతీయ స్థాయి 9వ ద్వైవార్షిక పోటీలు

నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం తేనెటీగ (హనీబీ) తత్వంతో (పువ్వుకు హాని కలుగకుండా తేనెని అందరికీ పంచే) గ్రామ స్థాయిలో రైతులు, వృత్తి కళాకారులు, మత్స్యకారులు, మహిళలు వ్యక్తిగతంగా గానీ లేదా సామూహికంగా గానీ, మురికివాడల నివాసితులు, వర్క్‌షాప్ మెకానిక్‌లు, విద్యార్థులు, స్థానిక గుంపుల నుంచి ఏవిధమైన సహాయమూ పొందకుండా వారికి వారే స్వతంత్రంగా రూపొందించిన ఇన్నోవేషన్లు, సాంప్రదాయ జ్ఞానాన్ని కనిపెట్టిన వారివద్దనుండి దరఖాస్తులు కోరబడుతున్నాయి. ఈ ఇన్నోవేషన్లు వ్యవసాయం, యంత్రాలు, వ్యవసాయ, వ్యవసాయేతర పద్ధతులు లేదా వస్తువులు, గృహోపకరణాలు, రవాణా, శక్తి ఉత్పాదన/ ఆదాకి సంబంధించిన, శ్రమను తగ్గించేవి పర్యావరణానికి హాని కలిగించని, తక్కువ ఖర్చుతో సాంకేతిక జ్ఞానానికి సంబంధించినవై వుండాలి. అయితే ఇవి స్వంత సృజనాత్మక శక్తితో, ఎవరి సహాయమూ/ పర్యవేక్షణా లేకుండా తయారు చేసినవై వుండాలి. ఎటువంటి సంస్థల నుండి సాంకేతిక సహాయం పొంది ఉండకూడదు. మహిళలకై లేదా మహిళల ఇన్నోవేషన్లకి ఉత్తమమైన సాంప్రదాయ జ్ఞానానికి ప్రత్యేక బహుమతులు ఉన్నాయి. అదేవిధంగా అవిటివారు రూపొందించిన లేదా వారు తయారు చేసిన ఉత్తమ ఇన్నోవేషన్లకి ప్రత్యేక బహుమతులు అందజేయ బడుతాయి. ఇంకా నమూనాలు తయారు చేయని సృజనాత్మక సాంకేతిక ఆలోచనలను కూడా స్వాగతిస్తున్నాం. పాఠశాలలో చదువుకుంటున్న/ చదువుకోని పిల్లల నుండి వారి ఆలోచనలను పంపటాన్ని ప్రోత్సహిస్తున్నాము.

**బహుమతులు :** వివిధ వర్గాలలో రూ. 10,000ల నుండి రూ. 7,50,000ల వరకు అందజ–యబడతాయి. 'జీవితకాల పురస్కారం' క్రింద జాతీయ స్థాయిలో మొదటి, రెండవ మరియు మూడవ బహుమతులు ఇవ్వబడతాయి. ఈ కేటగిరిలో వీరి బహుమతి సొమ్మునుంచి 15 శాతం వారు సమాజ శ్రేయస్సు, ప్రకృతి రక్షణకై ఏవిధమైన కార్యక్రమాలను ఎంచుకొని చేస్తున్నారో, వాటికయ్యే ఖర్చులకై అందజేయబడుతుంది. మొత్తం బహుమతిలో 35 నుండి 52 శాతం వరకు వారికి నెలవారీగా సహాయంగా అందించబడుతుంది.

ఇవేగాక గ్రామస్థాయిలో ఇన్నోవేషన్లు, సాంప్రదాయ జ్ఞానాన్ని శోధించిన వ్యక్తులు/ సంస్థలకు కూడా గుర్తింపు ఉంటుంది. వ్యక్తుల జ్ఞానాన్ని, సృజనాత్మకతకి మెరుగులు దిద్ది, అభివృద్ధి పరచిన సాంకేతిక వ్యక్తులని కూడా గుర్తించడం జరుగుతుంది. అదేవిధంగా గ్రామస్థాయిలో ఇన్నోవేషన్లకు, సహాయ సహకారాలు అందించిన ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాకు కూడా గుర్తింపు వుంటుంది. వారు తమ నివేదికలతో దరఖాస్తులు పంపించవలెను. వ్యక్తులు/గుంపులు తమ

**దరఖాస్తులని ఎన్.ఐ.ఎఫ్.కి 31 మార్చి, 2015 లోగా పంపించవలెను.**

దరఖాస్తులు పంపించవలసిన చిరునామా

**National Innovation Foundation-India**
**Satellite Complex, Premchand Nagar Road, Ahmedabad -380 015, Gujarat**
**Phone: (079) 26732456, 2095, Fax: (079) 26731903,**
**Email: campaign@nifindia.org, \Afebsite: www.nifindia.org**

సూచన : వృత్తిపరమైన అనుభవం కలవారు లేదా వృత్తి కళాశాలలో చదువుకొనే విద్యార్థులు ఎన్.ఐ.ఎఫ్. నుండి ఏవిధమైన తోడ్పాటు, గుర్తింపుకు అర్హులు కారని గమనించవలెను. అయినప్పటికీ అటువంటి వారు గ్రామస్థాయి ఇన్నోవేషన్లకి మెరుగు దిద్దినట్లయితే ఎన్.ఐ.ఎఫ్. వారిని గుర్తిస్తుంది. అర్హత వివరాలు, ఇతర మార్గదర్శక సూత్రాలకై http:// www.nif.org.in/announcement సంప్రదించండి. లేదా 'పల్లెసృజన' కార్యాలయంలో సంప్రదించండి

# పల్లెసృజన కార్యాలయంలో ఇన్నోవేషన్ల విస్తృత కేంద్రం

దేశవ్యాప్తంగా పునాదిస్థాయి ఇన్నోవేటర్లు (గ్రామీణ శాస్త్రవేత్తలు) తయారు చేసిన ఇన్నోవేషన్ల ప్రదర్శన 'పల్లెసృజన' కార్యాలయంలో ఏర్పాటు చేయడమైనది. ఈ ప్రదర్శనను పాఠశాల, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, రైతులు సందర్శిస్తున్నారు. రైతులు ఈప్రదర్శనను చూస్తే వారికి అవసరమైన పనిముట్లను గుర్తించి వాటిని లాభకరంగా వినియోగించుకునే అవకాశం లభించటంతో పాటు, దేశీయ జ్ఞానానికి చేయూతను అందించిన వారవుతారు. మీ సమస్యలను పల్లెసృజనతో చర్చించవచ్చు.



విక్రం రాథోడ్ సైకిల్ పంపు




రోషన్‌లాల్ విశ్వకర్మ చెరుకు కణుపులను కత్తిరించే సాధనం



గోపాల్ భిసే సైకిల్ నాగలి





మల్లేష్‌సోలార్ స్ప్రేయర్, రైతు ఫ్యాన్ల రిమోట్

హైదరాబాద్ వచ్చినపుడు 'పల్లెసృజన' కార్యాలయాన్ని తప్పక దర్శించండి.
ముందుగా మా కార్యాలయానికి సందేశాన్నిస్తే మీ సందర్శనను అర్థవంతంగా చేస్తాం.

'పల్లెసృజన' కార్యాలయం చిరునామా :

**67, రోడ్ నెం. 2, వాయుపురి, సైనిక్‌పురి పోస్టు, సికింద్రాబాద్ – 500 094.**
**ఫోన్ : 040–27111959, సెల్ : 9866 00 1678.**

## ధైర్యం, సృజనాత్మకత, దయాగుణాల మేలు కలయిక

హర్యానా రాష్ట్రంలోని 'మహేంద్రగఢ్' జిల్లాలో 24 -31 మే, 2014 వరకు జరిగిన

# 33వ జాతీయ స్థాయి శోధయాత్ర



హర్యానా, రాజస్థాన్ రాష్ట్రాల పొలిమేరల్లో వున్న ఈ ప్రాంతం తరతరాల నుంచి కూడా కరువు కాటకాలకు నిలయం. మాతృదేశానికైప్రాణాలర్పించిన ధైర్య సాహసాలుగల సైనికుల కొరకై కట్టిన స్మారక చిహ్నాలు ఇక్కడున్నన్ని ఎక్కడా చూడలేదు. మాతృభూమికై ప్రాణాలర్పించిన మన సైనికులని గౌరవించటం, వారి త్యాగాలని గుర్తించటంలో ఇక్కడి ప్రజల సంస్కారం తెలుస్తోంది. ఇక్కడి ప్రజలకి ఇంతటి ధైర్య సాహసాలు ఎక్కడ్నించి వచ్చాయన్న ప్రశ్న ఉద్భవిస్తుంది. దానిగురించి ఆలోచిస్తూవుంటే మరొక గొప్ప విషయం కనుగొన్నాం. ఈ ప్రాంతంలో బక్కచిక్కిన పిల్లలు ఎక్కడా కనిపించలేదు. దానికి కారణం ఇక్కడి తల్లులు తమ పిల్లలకి రెండు రెండున్నర సంవత్సరాల వయసు వచ్చేంతవరకు తన స్థనం పాలనే ఇస్తారు. రెండవ శిశువు ఆలస్యం అయితే ఐదు సంవత్సరాల వరకు అలాగే ఇస్తారట! మేము చూసిన ధైర్య సాహసాలకి, మాతృభక్తికి, ఈ తల్లిపాలకి ఏవైనా సంబంధం ఉందేవెూ అనిపించింది......

హర్యానా, రాజస్థాన్ రాష్ట్రాల పొలిమేరల్లో ఉన్నది కనుక 'మహేంద్రగడ్' జిల్లాలో రెండు రాష్ట్రాల సంస్కృతుల మేళవింపు కనిపిస్తుంది. ఇక్కడి ప్రజలకి ధైర్య సాహసాలన్నవి బహుశా పాటియాలా, పంజాబు కలిసి వున్నప్పటి పెప్సూ రాష్ట్రంలో ఉన్నందువలన వచ్చిందేమో. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 20 యేళ్ల వరకు హర్యానా, పంజాబ్, హిమాచల్ రాష్ట్రాలు కలిసే వుండేవి.

మహేంద్రగడ్ జిల్లాని ఆ ప్రాంతంలో 'బహిష్కృత ప్రదేశం'గా వర్ణిస్తారు. రాష్ట్రంలో ఎవరైనా అధికారిని శిక్షించాలనుకుంటే ఈ ప్రాంతానికి బదిలీమీద పంపిస్తారట! ఆ విధంగా చేయటం వలన ఆ అధికారినే కాదు, ఈ ప్రాంత ప్రజలను కూడా శిక్షించినట్లవుతుంది కదా అనిపించింది. మా యాత్రీకులకి సాధారణంగా పెద్దపెద్ద ఇసుక మేట్లతో వుండే ఈ ప్రాంతం గత 40 సంవత్సరాలుగా స్ప్రింక్లర్లు విచ్చలవిడిగా వాడటం వలన ప్రస్తుతం చాలా మారిపోయింది అని చెప్పారు స్థానికులు. పచ్చదనం అక్కడక్కడా కనిపిస్తున్నా భూమిలో నీటిమట్టం బాగా తగ్గిపోతోంది. ఉచిత కరెంటు ఉందికదా అని అవసరమున్నా, లేకపోయినా స్ప్రింక్లర్లు వాడటం బాగా అలవాటైంది ఈ ప్రజలకి.

ఇక సాంప్రదాయం, సంస్కృతిల విషయానికి వస్తే మాకు ప్రతిచోటా పెద్దపెద్ద పాత ప్రాసాదాలు, భవనాలు, సత్రాలు కనిపించేవి. ఇవి సాధారణంగా చెక్కతో చేయబడి, దిట్టమైన నగిషీలుండి చక్కటి రంగులతో అలంకరించబడి ఉన్నాయి. ఇక్కడి సత్రాలు వ్యాపారం చేసుకునే 'బనియా'లు కట్టించినవట. చాలామంది ఇక్కడ లేరుకానీ, సంవత్సరానికి ఒకసారి పండగలకి, పబ్బాలు జరుపుకోవడానికి వచ్చిపోతూ

వుంటారు. వర్షాలు తక్కువగా వుండి దాదాపు ఎడారి ప్రాంతంలా వున్న ఈ ప్రాంతంలోని ప్రజలు మాత్రం అతిథి సత్కారానికి ఏమాత్రం వెనుదీయరు. ప్రతిచోటా మండుటెండలో ప్రయాణం చేస్తున్న ప్రయాణీకులు దాహం తీర్చుకోవటానికని తాగే నీటి సదుపాయం వుంటుంది. మేము మా శోధయాత్రలో చాలా తీవ్రమైన ఎండలలో దాదాపు 15 రాష్ట్రాలు చూశాం. కానీ ఎక్కడ కూడా ఇక్కడున్నటువంటి సదుపాయం లేదు. నీరు పోయటానికి ఎవరూ వుండరిక్కడ. కుండల్లో నీరు వుంటుంది, ఎవరికి వారే పోసుకుని తాగాలి. దగ్గరలో ఎక్కడా నీటి వనరులు కనిపించలేదు. అయినా యాత్రీకులు తాగటానికి నీరు పెడుతున్నారంటే ఎంత దూరంనుంచి తెచ్చి పెడుతున్నారో మరి! అంతమంచి ప్రజలు ఇక్కడివారు. ఇంత కఠినమైన ప్రాంతంలో నివసిస్తున్న సున్నిత మనస్కులీ ప్రజలు. విచిత్రమనిపించింది మాకు. ముక్కు మొహం తెలియని ఆగంతకుడిని కూడా ప్రేమగా పలుకరించే ఈ సంస్కారం ఎక్కడ్నించి వచ్చిందో వీరికి. పిల్లల ఆశలను అణచివేయకుండా పెద్దలను గౌరవిస్తున్న ఈ ప్రజలను చూస్తుంటే ముచ్చటేసింది.

మా శోధయాత్ర కేంద్ర విశ్వ విద్యాలయం ప్రాంగణం నుంచి ప్రారంభమైంది. అంతకు ముందు అక్కడి అధ్యాపకులు, విద్యార్థులు మమ్మల్ని సాదరంగ ఆహ్వానించారు. ముందుగా 'జంతపాలి' గ్రామానికి చేరుకున్నాం. అక్కడి ప్రజలు తాము 'నీల్గాయ్' లాంటి జంతువుల నుండి తమ పంటలకు చాలా నష్టం జరుగుతోందని చెప్పారు. మేము హనీబీ వారు ఇంతకు ముందే ఇటువంటి జంతువుల నుండి పంటలను ఏవిధంగా రక్షించుకోవాలి అని తయారు చేసిన పుస్తకం వారికి ఇచ్చి పద్ధతులు వివరించాం. వారు చాలా సంతోష పడ్డారు. అక్కడ మాతో విశ్వవిద్యాలయానికి చెందిన హీరాలాల్ యాదవ్ అనే అతను కలిశాడు. ఆయన దేశమంతా సైకిల్ యాత్ర చేస్తూ



మహేంద్రఘర్ దృశ్యం



ప్రయాణీకులకు త్రాగునీటి వసతి

జీవ వైవిధ్యంపై అవగాహనకై ప్రయత్నిస్తున్నాడు. పిల్లలతో ఆయన చాలా సమయం జీవ వైవిధ్యం గురించి వివరించారు. అక్కడ జీవ వైవిధ్యంపై పోటీలు ఏర్పాటు చేశాం. హీరాలాల్ 'భావన' గ్రామం వరకు మాతో కలిసి ప్రయాణం చేశారు. తోవలో ఎన్నో విషయాలు చెప్పారు. భావనా గ్రామంలో మేము పిల్లలకి అప్పటికప్పుడు మీకు వచ్చిన ఆలోచనలు చెప్పమని పోటీ పెట్టాం. అక్కడ 'సచిన్' అనే పిల్లవాడు చెప్పిన ఆలోచన విని విస్తుపోయాం. 'సమాజం స్తబ్దుగా లేదు, అదీ ఆలోచిస్తోంది' అని పిల్లలు నిరూపిస్తారు అనిపించింది. సాధారణంగా పాఠశాలల్లో ప్రత్యేకించి ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు కూర్చునే బెంచీలు ఒకే ఎత్తున అందరికీ సమంగా ఉంటాయి. కొందరు చిన్న పిల్లలకి కింద కాళ్ళు ఆనక, నానా ఇబ్బందులు పడుతూ వుంటారు. కాళ్ళు ఆన్చుకోవడానికి కూడా వారికి కుదరదు. ఉన్న సదుపాయం వాళ్ళకి అందదు. సచిన్ ఆలోచన ప్రకారం పిల్లల ఎత్తుకి తగ్గట్టు మార్చుకోవడానికి వీలున్న బెంచీలు, స్టూళ్ళు ఉండాలంటాడు. ఆవిధంగా ఉంటే వాళ్ళు చక్కగా, కుదురుగా కూర్చుని పాఠాలపై శ్రద్ధ పెట్టే అవకాశముంటుంది. 'అంజలి' అనే విద్యార్థిని నీళ్ళ బకెట్‌కి చక్రాలు ఉంటే బరువును తోసుకుని వెళ్ళటం సులభమవుతుంది కదా అన్నది. అలాగే పిల్లలు పుస్తకాల సంచిని స్టూళ్ళుగా మార్చుకునే అవకాశం వుంటే బావుంటుంది అన్నది. జీవ వైవిధ్యం పోటీలలో 36 మంది పిల్లలు పాల్గొంటే 'మంగారాం' అనే విద్యార్థి 41 రకాల మొక్కల లక్షణాలు, వాటి వినియోగం గురించి చెప్పి పోటీలో గెలుపొందాడు. 'మంజూదేవి' అనే ఆమె అటక మామిడి గడ్డితో చేసిన 'రైతా' రుచి చూపించింది. అది తాగితే రక్తహీనత పోతుందట.

'తల్వానా' గ్రామానికి వెళ్తూ వుంటే కొందరు



కలుపు తీసే పరికరం

రైతులు ఎదురయ్యారు. మాకు రకరకాల పొలాలు చూపించారు. 'కేదార్‌నాథ్' అనే రైతు తన పొలం చూపించి, తాను గత కొద్ది సంవత్సరాలుగా రసాయనిక ఎరువులు వాడటం లేదని, సున్నపు రాయిని నీటిలో కలిపి వడగట్టి తన పత్తి పొలంలో పిచికారి చేస్తానని, ఆవిధంగా చీడలను అరికడుతున్నానని చెప్పాడు. విచిత్రమేమిటంటే ఆయన చెప్తూవుంటే మిగతా రైతులు కూడా ఈ విషయం మొదటిసారి వింటున్నట్లు మాకర్థమైంది. మేం వారికి ఒకరి అనుభవాలు ఒకరికి చెప్పుకుంటూ వుంటే మంచి చెడు నలుగురికీ తెలుస్తాయని, దీనివలన అందరికీ మేలు జరుగుతుందని సలహా ఇచ్చాము. అందరూ మంచి ఆలోచన అని మెచ్చుకున్నారు.

'ఖేడీ గ్రామం' దాటి 'అఘీర్' గ్రామం చేరుకున్నాం. అక్కడ 'సుధీర్' అనే యువకుడు తాను చేసిన 'మోటార్ సైకిళ్లకు పనికి వచ్చే పరికరం' చూపాడు. ఈ పరికరం అమర్చి స్టాండు తీస్తేగాని మోటార్ సైకిల్ స్టార్ట్ కాదు. దీనివలన ప్రమాదాలు నివారించవచ్చునని చెప్పాడు. మేముకూడా హనీబీలో వున్న వివిధ పరికరాల గురించి వారికి వివరించాం. అందరూ ఆసక్తిగా విన్నారు. అతను మాకోసం 'రేవారి' పట్టణం నుండి ప్రత్యేకంగా వచ్చాడట. అతని శ్రమని, ఆసక్తిని అభినందించాం. 'అనిత' అనే అమ్మాయి మనమందరం సాధారణంగా మన ఇళ్ళల్లో ఎదుర్కొనే సమస్యలను గురించి వివరించింది. మన ఇళ్ళల్లో సీలింగుకు వున్న ఫ్యాన్‌ను శుభ్రం చేయాలంటే చాలా కష్టంగా వుంటుంది. కష్టపడి ఎత్తులోవున్న ఫ్యాన్ రెక్కల క్రింది భాగాన్ని శుభ్రం చేయగలిగినా, పైభాగాన్ని శుభ్రం చేయడం చాలా కష్టం అన్నది. మేం దానికి ఏం చేయాలి అని అడిగాం. అందుకామె చాలా సులభం ఫ్యాను క్రిందికి దించి శుభ్రం చేసి తిరిగి పైకి లాగి కట్టే సదుపాయం ఉండాలి అంది. పూర్వకాలం చేతితో లాగే పెద్దపెద్ద ఫంకాలున్నప్పుడు ఇలాగే చేసేవాళ్లం కదా అన్నది. నిజమే కదా అనిపించింది.

'పవన్ నాథ్' అనే వ్యక్తి తనవద్ద జంతువుల ఆరోగ్యానికి పనికివచ్చే అనేక మూలికలు ఉన్నాయి అని చెప్పాడు. వివరాలు చెప్పమంటే నిరాకరించినా, ఫొటోలు తీసుకోవడానికి ఒప్పుకున్నాడు. అక్కడినుంచి 'పతేదా' గ్రామానికి వెళుతూ వుండగా తోవలో పొలాలలో అవసరం లేకపోయినా స్ప్రింక్లర్లు వాడటం గమనించాం. ఇదేంటని అడిగితే ఉచిత కరెంటు కదా అన్నారు. మేము అలా కాదు, ఈవిధంగా చేయటం వలన భూమిలోని నీటిమట్టం తగ్గిపోయి, ఇంకాపెద్ద కష్టాలను కొని తెచ్చుకున్నవాళ్ళం అవుతాం అని వివరించి ముందుకు సాగాము. పతేదా గ్రామంలో 'మాధవ్‌సింగ్' అనే వ్యక్తి తన పత్తిపొలంలో కలుపు తీయటానికి ఒక వీడర్‌ను తయారు చేసిపెట్టమని 'ఫర్మీందర్‌సింగ్' అనే మెకానిక్‌ని కోరాడట. మా కోరికపై దానిని తెచ్చి చూపించాడు. ఊర్లోవాళ్ళు కూడా దానిని చూడటం అదే మొదటిసారి. మీ ఇన్నోవేషన్ చాలా బాగుంది అని చెప్పి, 'గుదా' గ్రామానికి వెళ్ళాం.

అక్కడ పిల్లలు చెపుతున్న ఆలోచనలు చాలా బాగనిపించాయి. ఒక అబ్బాయి లారీలో కాని, కార్లోకాని, సీటు బెల్టు పెట్టుకోకపోతే వాహనం స్టార్ట్ కాకుండా ఉంటే



స్థానిక కళాత్మక గృహాలు

**మీరు పునాది స్థాయి ఇన్నోవేటర్ల జ్ఞానాన్ని ఒక పదిమంది స్నేహితులతో ఎపుడైనా పంచుకున్నారా?**

బావుంటుంది అన్నాడు. ఇంకో ఆలోచన మా యాత్రీకులకు బాగా నచ్చింది. బస్సులలో టిక్కెట్టు కొనుక్కున్నారో లేదో తెలుసుకోవటానికి ద్వారం దగ్గర ఒక సెన్సార్ ఏర్పాటు చేయాలని చెప్పాడు ఒకబ్బాయి. రాత్రిపూట ప్రాంతీయ భాషలో వారి సంస్కృతిని చాటిచెప్పే పాటలు పాడి మాకు ఆహ్లాదాన్ని కలిగించారు.

ఉదయం ప్రభుత్వ పాఠశాలను సందర్శించినప్పుడు ఇంకా ఎన్నో కొత్త ఆలోచనలు చెప్పారు అక్కడి పిల్లలు. 'చేలా బాస్' గ్రామానికి వెళుతూ వుంటే మధ్యమార్గంలో చాలామంది మమ్మల్ని ఆపి, మా యాత్ర గురించి అడిగి తెలుసుకున్నారు. వారికి మా యాత్ర ఉద్దేశ్యం వివరించగా చాలామంచి ఆలోచన, మా ఊరికి ఎప్పుడొస్తారు అని అడిగాడు. తోవలో మాకు ఎన్నో యుద్ధ స్మృతి చిహ్నాలు కనిపించాయి. ఆ ప్రాంతంలో చాలామంది సైన్యంలో చేరుతూ వుంటారట. ప్రతి ఇంట్లో ఒక వీరజవాను ఉంటాడట. ప్రత్యేకించి మా దృష్టిని ఆకర్షించింది పక్షులకు గింజలు పెట్టడానికి ఎత్తుగా స్తంభాలపైన 'చెబూతరాలు' కట్టి ఉంచటం. పక్షులకి తిండి పెట్టడం పుణ్యం మాట అటుంచి, మనుషులుగా అది మన ధర్మం కదండీ అన్నారు అక్కడి ప్రజలు. 'నవరతన్ చౌదరి' అనే రైతు తాను తన పొలంలో ఎప్పుడూ రసాయన ఎరువులు వాడలేదని గర్వంగా చెప్పాడు. చీడపీడల నివారణకి తాను వాడే సేంద్రియ పద్ధతులు వివరిస్తూ వుంటే, చుట్టుప్రక్కలవాళ్ళు ఆశ్చర్యంగా విన్నారు. వారెప్పుడూ వాటి గురించి వినలేదట.

చౌదరికి నీ జ్ఞానాన్ని నలుగురికీ పంచిపెట్టమని చెప్పాం. మాకు దాదాపు పదిహేను సంవత్సరాల క్రితం ఒక శోధయాత్ర సందర్భంగా గుజరాత్‌లో ఎదురైన ఒక అనుభవం గురించి ఆయనకు వివరించాం. ఒక పాఠశాల ఉపాధ్యాయుడు తన మామిడి మొక్కలని రక్షించుకోవటం ఎలాగని ఆలోచిస్తుండగా గతంలో ఆయనకి ఒక బస్టాండులో ఎవరో ఎదురై మామిడి చెట్లను రక్షించుకోవటానికి బూడిదలో ఎండిన టేకు ఆకులను కలిపి వేస్తే మొక్కలు బలంగా పెరుగుతాయని చెప్పింది గుర్తుకు వచ్చి ఆ పద్ధతి వాడి, తన మొక్కల్ని రక్షించుకొన్నాడట. నువ్వు సరే మరి ఈ విషయం ఇంకెవరికైనా చెప్పావా అని ఆ స్కూలు పంతుల్ని అడిగాం. ఆయన చెప్పాల్సిన సందర్భం రాలేదు అన్నాడు. కాదు, మనకు తెలిసింది నలుగురికీ చెప్పాలి అని మేం చెప్పగా ఆయన ఆ విషయం నలుగురికీ చెప్పగా అందరూ లాభపడ్డారు. ఈ విషయం చౌదరికి చెప్పి, జ్ఞానాన్ని దాచుకోకూడదు, నలుగురితో పంచుకోవాలి అని అన్నాం. అప్పుడు చౌదరి తన పద్ధతులని చుట్టుప్రక్కల వారికి వివరిస్తూవుంటే అందులో ఒకతను ఈ నవరత్న చౌదరి ఏదో పిచ్చివాడు అనుకునేవాళ్ళం. కానీ ఈయన దగ్గర పొలాలకి పనికి వచ్చే ఇన్ని మంచి పద్ధతులున్నాయని మాకందరికీ తెలిసింది. దీనికంతటికి మీరే కారణం. చౌదరితో పాటు మీకూ కృతజ్ఞతలు చెప్పాలి అన్నారు గ్రామస్తులు. మేము మా పనే ఇది అని చెప్పి మనసులో ఒక మంచి పని చేశామనుకుని ముందుకు సాగాం.

అక్కడినుంచి కొంత దూరం పోయాక ఒక ఇల్లు, పెద్ద దొడ్డి కనిపించాయి. గోడలమీదనుంచి తాళ్ళు వేళ్లాడుతో ఏదో ఆధునిక చిత్రపటం అనిపించింది ఆ ఇల్లు. ఉత్సుకతతో లోపలికి వెళ్ళాం. ఆ ఇంట్లో ఇద్దరు అక్క చెల్లెళ్ళు, ఇద్దరు అన్నదమ్ములను పెళ్ళి చేసుకున్నవాళ్ళు ఉంటున్నారట. మౌనిక ఆమె, ఆమె సోదరి మమ్మల్ని పలుకరించి మాట్లాడుతూ పశువులలో పాలు చక్కగా, పోషకాలతో ఉండాలంటే బి.టి. పత్తి వలవకుండా పశువుల దాణాతో కలిపి పెట్టాలి అని చెప్పాడు. సాధారణంగా జి.యం. పంటలకి వ్యతిరేకత ఎదురౌతున్న ఈ రోజుల్లో ఈ ఆలోచన జి.యం. పంటలను ప్రోత్సహించేలా వుందే అనిపించింది. ఇదివిన్న మా యాత్రీకులలో గుజరాత్ నుంచి వచ్చిన కొందరు ముసిముసి నవ్వులు నవ్వుకున్నారు. గుజరాత్‌లో బిటి పత్తులు విరివిగా వాడుతున్నారు మరి. మేమింతకుముందే చెప్పాం కదా అన్నట్లుంది వాళ్ళ నవ్వు.

'రాంబన్' గ్రామంలో మూలికా వైద్యుడు 'జగత్‌సింగ్'ను కలిశాం. అతనిదగ్గరికి రోజూ వెన్నునొప్పితో బాధపడుతున్నవారు 150 నుండి 200 మంది మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్, ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రల నుండి కూడా వస్తారట. చాలా ఆశ్చర్యమేసింది. జగత్‌సింగ్ వచ్చిన రోగులకి వారికి నయమయ్యేంత వరకు ఉచిత, వసతి భోజన సౌకర్యాలు కూడా కలిగిస్తుంటారట. అక్కడి రోగులని కొందరిని పలకరించగా దేశంలో ఎంతోపెద్ద ఆసుపత్రులలో ఎన్నో ఆపరేషన్లు చేసిన తర్వాత కూడా నయం కాని వెన్ను నొప్పిని కూడా ఈయన సులువుగా నయం చేస్తారని చెప్పారు.

మాకనిపించింది.... స్థానికంగా మనమధ్య ఉన్న ఎన్నో సమస్యలకి పరిష్కారాలు చూపించేవారు ఎందరో ఉన్నారు. వారిని వెలుగులోకి తీసుకు వచ్చి, సమాజ కళ్యాణానికి వాడుకునేలా మన విధాన నిర్ణయాలు, ప్రభుత్వ తీరుతెన్నులు ఎందుకు లేవు అని. దీనిపై అందరూ తీవ్రంగా ఆలోచించాల్సిన సమయం ఇది. **(సశేషం)** ●

# అడవి పందులు, ఏనుగుల నుండి పొలాలకి రక్షణ

అడవి పందులు పొలాల్లో చేరి, పంటను నాశనం చేయటమే కాక, పంటలకి మేలు చేసే వానపాములను, మిత్ర పురుగులను తినేస్తాయి. వీటినుండి పంటలని రక్షించుకోవటం కోసం రైతులు "ఎర్ర కారం పొడి"ని పొలం గట్లమీద చల్లుతారట. ఈ ఘాటుకి పందులు పొలాల ఛాయలకి రావట. ఈ పద్ధతి గుజరాత్ రాష్ట్రంలోని బనస్కాంత జిల్లాలో కూడా అవలంభిస్తూ వుంటారట.

హర్యానాలో జరిగిన శోధయాత్ర సందర్భంగా అక్కడి రైతులు మా శోధయాత్రీకులకి వారు అవలంభించే పద్ధతులను గురించి వివరించారు. కారం చల్లటం వలన చాలా క్రిములు నాశనమౌతూ వుండటంతో రైతులు ఎండిన ఎర్ర మిరపకాయలను ఆవుపేడతో కలిపి పిడకలు చేసి పొలాల గట్లవెంబడి కాలుస్తారట. ఈ ఘాటైన పొగకి జంతువులు పొలాల్లోకి రాకుండా పోతాయట.

'నేషనల్ జియాగ్రాఫిక్ న్యూస్' సెప్టెంబర్ 18, 2006లో ప్రచురించబడ్డ ఒక వ్యాసం ప్రకారం ఆఫ్రికా దేశంలో చాలాచోట్ల ఈవిధంగానే కారం పొడిని పేడలో కలిపి కాల్చి ఏనుగుల నుండి తమ పొలాలని రక్షించుకుంటారట. కొందరు పొలాల చుట్టూ కారం పొడి గ్రీసు కలిపిన తాళ్ళని కంచెగా కట్టి ఇదేవిధమైన ఫలితాలను పొందుతున్నారట. జనవరి 21, 2010 'ది హిందూ' పత్రికలో ఆర్. క్రిష్ణకుమార్ వ్రాసిన వ్యాసం ప్రకారం కర్ణాటక ప్రాంతం, చామరాజనగర్ జిల్లాలో రైతులు కొబ్బరి తాడుకి ఇంజనాయిలు, కారము కలిపి పూసి పొలానికి కంచెలా కట్టి జంతువుల నుండి తమ పొలాలని కాపాడుకుంటున్నారు.

('పల్లెసృజన'లో గతంలో ప్రచురించిన వ్యాసాలు మీకోసం మళ్ళీ....)

## అడవి పందులనుండి పంటలను కాపాడుకోవటమెలా?

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పలు గ్రామాల్లో పంట పొలాలను ధ్వంసం చేస్తున్న అడవి పందులను రైతులు చాలా స్వల్ప ఖర్చుతోనే తరిమి కొట్టవచ్చు. అడవి పందును పారద్రోలేందుకు దీపావళి సామాగ్రి తయారీకి ఉపయోగించే గంధకం పొడిని, ఆముదాన్ని కలిపిన మిశ్రమాన్ని పురికొన (సుతిలి)కి పూయాలి. ఈ తాడును పొలం గట్లవెంట నాలుగువైపులా కట్టాలి. అడవి పంది దూరం నుంచే ఈ వాసనకు తల్లడిల్లి పొలంవైపు రాకుండా పారిపో తుంది. అక్కడ వేరే పందిని వధించినట్టుగా వచ్చే ఈ వాసనగా ఆ పంది అనుమానించి వెంటనే అక్కడినుండి నిష్క్రమిస్తుంది. రాష్ట్రంలోని కొన్నిచోట్ల ఈ ప్రయోగాన్ని ఆచరించి ఫలితాలు సాధించడం జరిగింది.

(జనవరి–మార్చి 2007)

## ఫలించిన రైతుల ఇన్నోవేషన్

'పల్లెసృజన' గతంలో ప్రచురింపబడ్డ "అడవి పందుల దాడిని ఎదుర్కొనేందుకు" అని ప్రచురించిన రైతుల ఇన్నోవేషన్ గురించి పాఠకులకు విదితమే. గుంటూరు జిల్లా వినుకొండ మండలం లోని కొచ్చెర్ల గ్రామానికి చెందిన "ఆచార్య కొసరాజు తిరుమల రావు" గారు కూడా ఇలాంటి ప్రయోగాన్ని ఆచరించి మంచి ఫలితాన్ని పొందడం జరిగింద ని తెలియజేశారు. రాష్ట్రంలోని రైతులు 'పల్లెసృజన' ప్రయోగాలను ఆచరించడం మాకెంతో ఆనందాన్నిచ్చింది. 'పల్లెసృజన' ప్రచురించిన ప్రయోగంలో 'సుతిలి' (పురికొస/ జూట్ దారం) పొలం గట్లచుట్టూ కట్టి దానికి ఆముదం మరియు గంధకాన్ని పట్టిస్తే ఆ వాసనకు అడవి పందులు పొలం దరిదాపుల్లోకి రావని చెప్పడం జరిగింది. తిరుమలరావు గారు దీనికి తోడుగా "సూరేకారం"ను కూడా కలిపి పట్టించడంతో అడవి పందులతో పాటు కోతులు కూడా దాదాపు 20 రోజుల వరకు ఆ పొలం వైపు రాలేదని తన అనుభవాన్ని తెలియజేశారు. రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో అడవి పందులవల్ల రైతులు చాలా నష్టపోతున్నారు. ఈ ప్రయోగాన్ని మీరూ చేసి మీ పంటలను కాపాడుకోగలరు.

నిజామాబాద్ జిల్లాలోని రైతులు లేతరంగు చీరలను పొలం చుట్టూ కడతారు. దాంతో పందులు రావటం మానేశాయని ఆ రైతులు శోధయాత్రీకులతో ఆనందంగా చెప్పారు.

(సెప్టెంబర్–అక్టోబర్–2013)

## మీరూ ఆలోచించండి! మీ అనుభవాలను పంచుకోండి!!

తెలుగు రాష్ట్రాల్లో అడవి పందుల బెడద రైతాంగాన్ని పీడిస్తున్న సమస్య పాఠకుకు విదితమే. గతంలో అడవి పందుల నుండి పంటలను కాపాడుకొనుటకై రైతులు చేసిన కొన్ని ప్రయోగాలను పల్లెసృజన ప్రచురించింది. కానీ 9వ చిన్న శోధయాత్రలో మెదక్ జిల్లా రైతులు ఎన్ని రకాల ప్రయోగాలు చేసినా అడవి పందుల బారినుండి తమ పంటలను కాపాడుకొనటం అతి కష్టంగా ఉందన్నారు. రాత్రింబవళ్ళు పొలాల్లో కాపలా ఉండక తప్పటం లేదు అని వాపోతున్నారు.

ఈ సమస్య వేలాదిమంది రైతులను, వారి కుటుంబాలను వేధిస్తున్నదని పల్లెసృజన భావిస్తుంది. ఈ సమస్య పరిష్కారం కొరకు రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాలలో కొంతమంది రైతులు కొన్ని పద్ధతులను ఆచరించి విజయం సాధించి వుంటారు. అలా మీరు ఆచరిస్తున్న పద్ధతులను మాతో పంచుకుంటే 'పల్లెసృజన' పత్రికలో అందరి అనుభవాలను ప్రచురిస్తాం. ఒకవేళ సైంటిస్టులు కూడా ఈ సమస్యను తాము విజయవంతంగా చేసిన ప్రయోగాలు ఏవైనా వుంటే మాతో పంచుకోవచ్చు.

ప్రకృతిపరమైన సమస్యలకు పరిష్కారం ప్రకృతిలోనే ఉందని 'పల్లెసృజన' ప్రగాఢ విశ్వాసం. వివిధ ప్రాంతాలలోని రైతులు తాము అడవిపందుల బారినుండి పంట రక్షణకై చేస్తున్న ప్రయోగాలను మాతో వ్రాత రూపకంగానైనా, ఫోన్‌లోనైనా పంచుకోవచ్చు. ఈ సమస్యకు చక్కటి పరిష్కారం మనమంతా కలిసి వెతుకుదాం. మీ సహకారాన్ని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాం.

– ఎడిటర్

(నవంబర్–డిసెంబర్–2013)



## నిశ్శబ్దంగా 100వ సంవత్సరంలోకి అడుగిడుతున్న

# బాబీ బేన్

ఆమె ఎక్కువగా మాట్లాడదు, ఆమె భావాలు మాటలకన్నా గొప్పవి. ఆమె మాట్లాడని మాటలే ఆమె ఆస్తి.

"బాబీ బేన్ రాంచందర్ ఠాకూర్" ఎన్నో కష్టాలకు ఓర్చి, చిన్నతనంలోనే బాధ్యతలు చేపట్టి, దాదాపు 100 సంవత్సరాల సంతృప్తికర జీవితం పూర్తి చేసుకోబోతోంది. తన జీవిత కాలంలో ఎన్నో ఒడిదుడుకులు చవిచూసింది. ఎక్కువగా మాట్లాడని ఆమె చాలా శక్తివంతమైన మహిళ అనే చెప్పాలి. ఎన్ని కష్టాలొచ్చినా బెంబేలు పడిపోకుండా వాటిని ఎదుర్కోవటంలోనే ఆమె శక్తి ప్రకటితమైంది. గుజరాత్ రాష్ట్రంలోని బనస్కాంత జిల్లాలో ధనేరా పట్టణం దగ్గర వున్న 'వారన్' గ్రామంలో జన్మించిందామె. తన తల్లిదండ్రులకున్న ఐదుగురు ఆడ సంతానంలో నాలుగవ కూతురీమె. నేనింత కాలం బతుకుతాననుకోలేదు అంటారామె రొప్పుతూనే అందంగా నవ్వుతూ. నాకింత వయసొచ్చిందంటే నాకే ఆశ్చర్యంగా వుంటుంది. నా తల్లిదండ్రులు చాలా చిన్నప్పుడే చనిపోయారు. నేనెప్పుడూ కలలోకూడా అనుకోలేదు ఇంతకాలం జీవిస్తానని. తలుచుకుంటే నిజంగా ఆశ్చర్యంగా వుంటోంది అంటారామె. ఎందుకంటే మా వంశంలో ఎవరూ ఎక్కువ కాలం జీవించటం అన్నది లేదు. అని చెప్పారామె.

తన తల్లిదండ్రులు తన చిన్నతనంలో చనిపోయారు ఆ తర్వాత తన అక్కలని, ఒక్కగానొక్క చెల్లిని పెంచే బాధ్యత తానే తీసుకున్నానని చెప్పిందామె. ఏమిటో విచిత్రం నేను అక్కలకన్నా చిన్నదాన్నే అయినా వాళ్ళని సంరక్షించే బాధ్యత నేనే తీసుకున్నా. కుటుంబాన్ని పోషించుకోవటానికి గంటలకొద్దీ పొలంలో పనిచేయాల్సి వచ్చేది. ఎంత కష్టపడ్డా నేను నా అక్కలని, చెల్లిని పోషిస్తున్నాను అన్న తృప్తి చాలా హాయినిచ్చేది. వాళ్లందరికీ నేనే ఆసరా అన్న భావన కొంత గర్వం కలిగించినా వారికి నేనే కదా ఆర్థికంగా, నైతికంగా ఆసరా అన్న ఆలోచన ఆనందాన్నిచ్చేదని చెప్పారావిడ.

తన చెల్లి, అక్కల పెళ్ళిల్లు అయ్యాక, ఆ బాధ్యతలు నెరవేర్చిన తర్వాత తన పదిహేనవ యేట తాను వివాహం చేసుకున్నదట. తనకి ఇద్దరు కుమారులు, ఐదుగురు కూతుళ్ళు కనక తాను తల్లిగా క్షణం తీరిక లేకుండా గడపాల్సి వచ్చేది అన్నదామె. పొలంలో పని చేసుకుంటూనే తన పిల్లలని సంరక్షించుకుంటూ వారి ఆలనా పాలనా చూసుకోవాల్సి వచ్చేది. చాలా కష్టపడ్డాను నాయనా అని చెప్పిందావిడ.

ఆమె పెద్ద కొడుకు కలగజేసుకొని చిన్నప్పుడు మేము చాలా అల్లరి చేసేవారమట. ఆమెని పని

**కాలం మారింది. ఎన్నో కొత్త సామాన్లు పుట్టుకొచ్చాయి. జీవితం సులభతరం అయిపోతోంది, అయినా కొన్ని పాత పద్ధతులు, ఆచారాలు మారలేదు మా ఇంట్లో. మా అమ్మ ఇప్పటికీ అల్లుళ్ళ ముందు మేలిముసుగు వేసుకునే వుంటుంది. తలమీద ముసుగుతోనే వాళ్ళకెదురు పడుతుంది. ఈతరం వారికిది వింతగా, తమాషాగా వున్నా ఇదే ఆచారమ్రా అంటుందామె.**

చేసుకోనివ్వకుండా అడ్డుపడుతూ వుంటే మమ్మల్ని ఇసుకలో గొంతువరకు పూడ్చిపెట్టేదట. మేము కదలకుండా వుంటే తను చకచకా పనులు ముగించుకునేది. మాకూ సరదాగానే వుండేది. మేమే అడిగేవాళ్లం అమ్మా ఇసుక ఆట ఆడుకుందామని. ఒకప్పుడు మా చేతులు, కాళ్ళు కట్టేసేది అదీ ఆటగానే వుండేది మాకు అని చెప్పాడతను. తాను తన పిల్లల్ని పెంచిన ఇంట్లోనే ఇప్పుడూ జీవిస్తున్నాను అన్నదామె. ఇప్పటికీ తనవంట తనే చేసుకుంటూ ఇంట్లో వారికి సహాయపడుతూ వుంటుంది. మా అమ్మవంట చాలా బ్రహ్మాండంగా వుంటుంది. మేమెంతో ఇష్టపడే వంటకం ఆమె చేసే “మాల్పురా”. మైదా పిండి, అరటిపళ్ళు, బిల్వ పళ్ళు కలిపి చాలా అద్భుతంగా వండుతుంది మా అమ్మ. అడిగి మరీ చేయించుకుంటూ వుంటాం ఇప్పటికీ. కొన్ని సంవత్సరాల క్రితం కంటికి ఆపరేషన్ జరిగింది కానీ, ఇప్పటికు ఆరోగ్యంగా తన పనులు తాను చేసుకుంటూ కోడళ్ళకీ సహాయం చేస్తూ వుంటుంది అని చెప్పాడు కొడుకు.

కాలం మారింది. ఎన్నో కొత్త సామాన్లు పుట్టుకొచ్చాయి. జీవితం సులభతరం అయిపోతోంది, అయినా కొన్ని పాత పద్ధతులు, ఆచారాలు మారలేదు మా ఇంట్లో. మా అమ్మ ఇప్పటికీ అల్లుళ్ళ ముందు మేలిముసుగు వేసుకునే వుంటుంది. తలమీద ముసుగుతోనే వాళ్ళకెదురు పడుతుంది. ఈతరం వారికిది వింతగా, తమాషాగా వున్నా ఇదే ఆచారమర్రా అంటుందామె. మనం మాట్లాడే పద్ధతులు మారినా మన సంబంధాలు మారినా, కొన్ని మాత్రం ఎప్పటికీ మారవు, మారకూడదు అంటుందావిడ.

ఇప్పుడైతే టీవీలు, రేడియోలు వచ్చాయి. మా చిన్నతనంలో ఇవేమీ లేవు. అయినా ఆనందంగానే బతికాం. ఈ కాలంలో పిల్లలు బైట ఆడుకోవటమే మానేశారు. ఎప్పుడూ టీవీలు, సెల్ ఫోన్లే. బయటికి వెళ్ళి ఆడుకుంటే ఎంత ఆరోగ్యకరమో వారికి తెలియదు. ఎవ్వరూ వారికి చెప్పటం లేదు కూడా అని వాపోయారామె. ప్రపంచంలో ఎన్నో మార్పులు వచ్చాయి. అన్నిటినీ గమనిస్తూనే వున్నారు. అన్ని మార్పులూ మన మంచికే అని చెప్పలేను. ఇప్పుడైతే అన్ని జబ్బులకి డాక్టర్లు ఖరీదైన మందులు వచ్చాయి. నా చిన్నతనంలో ఏమీ లేవు. కేవలం ఇంట్లోనో లేదా పొలంలోనో దొరికే పళ్ళు, పూలు, ఆకులు, దుంపలతో వైద్యం చేసుకునే వాళ్ళం. ఎంతటి జ్వరమైనే ఇట్టే తగ్గిపోయేది కానీ ఖర్చు లేకుండా. ఇప్పుడు ఇంత అభివృద్ధి అంటున్నారు అయినా ప్రతి దానికీ ఎంతో ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ కాలంలో నేను గమనించింది మనుషుల మధ్య కక్షలు, కార్పణ్యాలు, ఈర్ష్యా ద్వేషాలు పెరిగి పోయాయి. మాకాలంలో అవేమీ ఎరగం అంతా కలిసి కట్టుగా వుండేవాళ్ళం. పిలిచినా, పిలవక పోయినా ఒకరికొకరం సహాయం చేసుకునే వాళ్ళం. ఊరంతా ఒక పెద్ద కుటుంబంలా వుండేది. కష్టాలు, సుఖాలు అన్నీ పంచుకునేవాళ్ళం. ఇప్పుడివేం కనపడటం లేదు అని కొంత బాధపడుతూ చెప్పారామె.

నేనింతకాలం బతికానూ అంటే ఏమో మరి చక్కటి ఆరోగ్యకరమైన తిండి తినేవాళ్ళం, కష్టించి ఒళ్ళొంచి పనిచేసే వాళ్ళం. చీకూ చింతా మర్చిపోయి కంటినిండా నిద్రపోయేవాళ్ళం. ఒకరికొకరం సహాయం చేసుకుంటూ ఆనందంగా ఉండేవాళ్ళం. బహుశా ఇదే కారణమై వుంటుంది నేనింతకాలం బతకడానికి మనిషికి ఇంతకన్నా ఏం కావాలి అని అమాయకంగా, తెలివిగా, జీవన సారాన్ని నిఖ్ఖచ్చిగా చెప్పిందావిడ.

పొలంలో ఎంత కష్టపడి పనిచేసినా, ఇంట్లో ఇంత మందికీ శ్రమపడినా సాయంత్రం నా భర్త, పిల్లలతో కలిసి ఉన్నదాంట్లోనే సంతృప్తిగా భోంచేస్తూ వాళ్ళ కబుర్లు వింటూవుంటూవుంటే ఎంత అలసటైనా ఇట్లే మాయమై పోయేది. ఇంకా ఎంతో శక్తి వచ్చేది. వీళ్ళందరికోసం ఇంకా ఏమైనా చేయగలనన్న ఆత్మవిశ్వాసమూ కలిగేది అని చెప్పారావిడ.

ఈ కాలంవాళ్ళకేం చెప్పను, వింటానంటే నాదో సలహా, నేనదే పాటించాను. ఎవ్వరికీ హాని కానీ, కీడుగాని చెయ్యకండి. అందరికీ సహాయం చెయ్యండి, అందరి మేలూ కోరుకోండి, మంచివాళ్ళు అనిపించుకోండి. ఆ దేవుడు మీకు మేలు చేస్తాడు, మనస్పూర్తిగా దీవిస్తాడు అని సెలవు తీసుకున్నారావిడ.

మెల్లగా అడుగులేస్తూ తన జీవితంలో మరో రోజులోకి అడుగులేస్తూ కదిలారామె.

# వివిధ రాష్ట్రాల నుండి సేకరించిన పల్లె జ్ఞానం

**25201**

**గారకాయతో పంటల చీడ నివారణ :**

పంటలకు చీడ పట్టినపుడు వాటి నివారణకు రకరకాల మందులు వాడుతూ వుంటారు రైతులు. సరియైన సమయంలో సరియైన మందులు వాడకపోతే మొత్తం పంటనే వదులుకోవాల్సి వస్తుంది. దీనికై గుజరాత్ రాష్ట్రానికి చెందిన రాజ్‌కోట్ జిల్లా, జస్‌ధన్ తాలూకా, మిటాలియా నివాసి "ఛగన్‌భాయ్ పంచ్‌భాయ్" సులభమైన మార్గం కనుగొన్నాడు. తనపద్ధతి వివరిస్తూ ఆయన 5 కిలోల వేప ఆకును మెత్తగా నూరి దానిలో 150 గ్రా. గార పండ్లను కలిపి




70 లీటర్ల నీటిలో బాగా మరగబెడ్తాడు. ద్రావకం తేరటానికి చివరలో ఏదైనా సబ్బుపొడిని వాడుతాడు. ఈ ద్రావకాన్ని ఆయన సంవత్సరానికి ఒకసారి చేసి వుంచుకొని గాలి సోకని డ్రమ్ములో నిల్వ ఉంచుకుంటాడు. అవసరమైనపుడు 500 మి.లీ. ద్రావకానికి 15 లీటర్ల నీటిని కలిపి పంటపైన పిచికారి చేస్తాడు. ఈ పద్ధతిని తాను చాలా కాలం నుండి అవలంభిస్తున్నానని, పంటలో చీడ కనిపించినపుడల్లా ఇలా పిచికారి చేస్తానని, తన చుట్టుప్రక్కల గ్రామాల రైతులకి కూడా తాను తయారు చేసిన ద్రావకాన్ని ఇస్తానని, అందరూ ఇదే వాడుతున్నారని చెప్పారు.

**25204**

**నాగజెముడు, గారకాయలతో సస్యరక్షణ :**

గుజరాత్ రాష్ట్రం, ఆరావలి జిల్లా, మోడసా తాలూకాలోని "రాహెవార్ జువాన్‌సింగ్ మఖన్‌సింగ్" చాలా సంవత్సరాల నుంచి వ్యవసాయం చేస్తూవున్నాడు. తన పంటలకి ఆకులపై ఎర్రచుక్కలు వచ్చినప్పుడు దాని నివారణకి తానే స్వంతంగా ఒక మార్గం కనుగొన్నాడు. నాగజెముడు, గార పండ్లను చెరో రెండు కిలోలు తీసుకుని మెత్తగా నూరి దానిలో ఒక లీటరు నీటిని కలిపి ద్రావకం సగం అయ్యేంత వరకు బాగా మరగబెడ్తాడు. తర్వాత దాన్ని వడకట్టి ఆ ద్రావకాన్ని నీటిలో కలిపి 5 నుండి 6 రోజుల వరకు సరుసగా పంటలపై పిచికారి చేస్తాడు. దాంతో ఈ ఎర్రమచ్చల తెగులు నివారణ అవుతుంది అంటున్నాడు.

**25205**

**పురుగుల నుండి జొన్న పంటకు రక్షణ :**

జొన్న పంటకి పురుగు పట్టినప్పుడు సరియైన నివారణ చర్యలు తీసుకోకపోతే జొన్నలు నాణ్యత కోల్పోతాయి. దీని నివారణకి గుజరాత్ రాష్ట్రం, బనస్కాంతా జిల్లా, తారాడ్ తాలూకాకు చెందిన "విక్రంభాయ్ ఎ. రాజ్‌పుట్" తానే స్వయంగా తయారు చేసుకున్న ఒక సేంద్రియ పద్ధతిని వాడుతూ వుంటాడు. 3 కిలోల ఉల్లిపాయలను బాగా నూరి, అరలీటరు నీటిలో కలిపి కొద్దిసేపటి తర్వాత ఆ ద్రావకాన్ని వడకట్టి, జొన్నపంటపై పిచికారి చేస్తాడు. తనకున్న ఒక ఎకరా పొలంలో జొన్న పంటను తాను ఈ పద్ధతిలోనే కాపాడుకుంటానని, మంచి ఫలితముంటుందని చెప్తున్నాడు.

**25212**

**పశువుల ప్రేవుల్లో పురుగుల (పేగు శోధము) నివారణకు :**

పశువుల ప్రేవుల్లో పురుగులు చేరినపుడు అవి చురుగ్గా ఉండక, మేత కూడా మేయలేక డీలాపడిపోతాయి. సరియైన సమయంలో చికిత్స చేయకపోతే ప్రాణాపాయానికి కూడా దారితీయవచ్చు. దీని చికిత్సకి కేరళ రాష్ట్రం, పాల్కాడ్ జిల్లాలోని రైతులు ఈ క్రింది పద్ధతిని వాడుతూ వుంటారు. వారు గుప్పెడు 'రేల' ఆకులని తమలపాకులతో కలిపి నూరి, ఒక లీటరు నీటితో కలిపి మూడోవంతు అయ్యేంత వరకు మరగబెడ్తారు. చల్లారిన తర్వాత ఆ ద్రావకాన్ని 50 నుండి



4. 200 గ్రా. ఉల్లిపాయలను బాగా మెత్తగా నూరి 100 గ్రా. వాముతో కలిపి ఈ మిశ్రమంలో 100 గ్రా. గాలిలో వుండే మర్రిచెట్టు లేత ఊడలను జతచేసి పశువుచేత తినిపించినచో అజీర్తి వ్యాధినుండి ఉపశమనం లభిస్తుంది.



100 గ్రా. వరకు రోజుకు రెండుసార్లు చొప్పున రోగం వచ్చిన పశువు చేత తాగించి మంచి ఫలితం పొందుతున్నారు.

**25213**

**పశువుల అజీర్తి వ్యాధికి మందులు :**

1. పశువులు అజీర్తి వ్యాధితో బాధపడుతున్నపుడు వాటిని ఆ బాధనుండి విముక్తి చేయటానికి సులభమైన మార్గం వాటిచేత బొప్పాయి పండు తినిపించటం.

2. ఒక లీటరు నీటిలో 200 గ్రా. కానుగ కాయలను మెత్తగా నూరి కలిపి ఈ ద్రావకం సగం అయ్యేంతవరకు మరగ బెట్టాలి. తర్వాత ఈ ద్రావకాన్ని వడకట్టి దానిలో రెండు నిమ్మకాయల రసాన్ని, 5 గ్రా. వంట సోడాను కలిపి ప్రతి ఆరు గంటలకు ఒకసారి కొద్దికొద్దిగా పశువుచేత తాగిస్తే అజీర్తి వ్యాధి నుండి ఉపశమనం పొందుతుంది.

3. 50 నుండి 100 మి.లీ. వేరుశనగ నూనె, అంతే ప్రమాణంలో టర్పెంటాయిల్ లో కలిపి బాగా కలియగలిపి ఆ ద్రావకాన్ని కొద్ది కొద్దిగా ప్రతి రెండు మూడు గంటలకి పశువుచేత తాగించినా కూడా మంచి ఉపశమనం వుంటుంది.

## NIF లో మీకు అవసరమైన ఇన్నోవేషన్‌ల అన్వేషణ

నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ గత 14 యేళ్ళుగా సేకరించిన గ్రామీణ ఇన్నోవేషన్లు, సాంప్రదాయ జ్ఞానం ప్రజలందరికీ అందుబాటులో వుండటానికై ఒక వెబ్‌సైట్ తయారు చేసింది. ఈ జ్ఞానమంతా వెబ్‌సైట్ www.nifindia. org లో చూడవచ్చు. అలాగే మీకు ఏ సమస్యకైనా పరిష్కారం ఈ జ్ఞానం కోశంలో వుందో లేదో తెలుసుకోవాలనుకుంటే

**NIF టోల్ ఫ్రీ నెంబర్**

**1800 233 5555**

కు కూడా ఫోన్ చేసి తెలుసుకోవచ్చు. కానీ ఫోన్‌లో మాట్లాడాలనుకునేవారు ఇంగ్లీషు లేదా హిందీలో మాత్రమే సంప్రదించవలసి వుంటుంది.

**వ్యవసాయదారుల మేధోసంపత్తి హక్కులు కాపాడటానికి మీరు సిద్ధమేనా?**



# ఇగ్నైట్-14

పిల్లలలో ప్రత్యేకించి బడి పిల్లలలోని సృజనాత్మకత, ఇన్నోవేటివ్ స్ఫూర్తిని కలిగించటం కోసం జాతీయ స్థాయిలో జరిగే పోటీయే 'ఇగ్నైట్'. పిల్లలు తమ స్వంత సాంకేతిక ఆలోచనలని, ఇన్నోవేషన్లని దేనికి పంపాలని కోరటం జరుగుతుంది.

సెప్టెంబర్ 1, 2013 నుండి ఆగష్టు 31, 2014 వరకు జరిగిన 'ఇగ్నైట్-14' జాతీయ స్థాయి పోటీలకు దేశంలోని 35 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలోని 359 జిల్లాలోనుండి 2,7123 మంది పిల్లలు పాల్గొన్నారు. ఇన్నోవేషన్ రోజగా జరిగే డా. ఎ.పి.జె. అబ్దుల్ కలాం గారి పుట్టిన రోజైన అక్టోబర్ 15న ఎన్.ఐ.ఎఫ్. ఈ పోటీల బహుమతులు ప్రకటించారు. ఐ.ఐ.ఎం. అహమ్మదాబాద్ లో నవంబర్ 19, 2014న అబ్దుల్ కలాంగారి చేతుల మీదుగా గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం జరిగింది. విజేతలు వారి ఇన్నోవేషన్ల వివరాలు మీకందిస్తున్నాం.

## కీళ్ళనొప్పులు తగ్గటానికి మార్పు చేయబడ్డ బూట్లు :

**షేక్ ముజామిల్ పాషా, 6వ తరగతి, క్యాజిల్ టౌన్ హైస్కూల్, హైదరాబాద్, తెలంగాణ.**

షేక్ ముజామిల్ పాషా బాబాయి కీళ్ళనొప్పుల కారణంగా తరచూ డాక్టర్లను సంప్రదించాల్సి వచ్చేది. ఇది గమనించిన పాషా ఆ నెప్పి నివారణకి బూట్లలో వెనకవైపున వుండే మడమని బూటు ముందువైపుకు మార్చి ప్రయత్నించి చూడగా వాళ్ళ బాబాయి కీళ్ళనొప్పులు మాయమైపోయాయి. ఈ విధంగా బూట్లు తయారు చేయటానికి డిజైన్‌లో కొద్దిపాటి మార్పులు చేశారు.

ఎన్.ఐ.ఎఫ్. పాషా పేరున ఈ బూట్ల పేటెంటుకై దరఖాస్తు చేసింది. పాషాకి శాస్త్ర విషయాలపై మక్కువే కాక, సైకిలింగ్, చిత్రలేఖనంపై కూడా ఆసక్తి. ఇతను రోజూ యోగా, ధ్యానము క్రమం తప్పకుండా చేస్తాడు.






మీ పిల్లల ప్రశ్నలకి సమాధానం తెలియదు అని మీరు చివరిసారిగా ఎప్పుడు ఒప్పుకున్నారు?

## ల్యాప్‌టాప్/ మొబైల్ చార్జర్ ఎడాప్టర్‌కి అదనంగా పవర్ బ్యాకప్ :

**మహమ్మద్ అబీద్ ఖుషీద్ రైనా**, 6వ తరగతి, జవహర్ నవోదయ విద్యాలయ, కుల్‌గావ్, జమ్ము & కాశ్మీర్. మరియు **రోహిత్ తివారి**, 12వ తరగతి, టి.టి.జె.యం. సరస్వతీ విద్యామందిర్, బొఖారో, జార్ఖండ్.



సెల్‌ఫోన్లు లేదా ల్యాప్‌టాప్‌లలో బ్యాటరీ అయిపోయినప్పుడు వాటిని చార్జి చేయటానికి అందుబాటులో ప్లగ్ పాయింట్ లేకపోతే చాలా ఇబ్బంది పడవలసి వస్తుంది. వేరువేరు సందర్భాలలో ఇది గమనించిన మహమ్మద్ అబీద్ ఖుషీద్ రైనా, రోహిత్ తివారీలు మొబైల్ ల్యాప్‌టాప్ అడాప్టర్‌లోనే ఒక ఇన్‌బిల్ట్ పవర్ బ్యాకప్ ఏర్పాటు చేస్తే మొబైల్ లేదా ల్యాప్‌టాప్‌లు చార్జి అవుతున్నప్పుడే ఈ పవర్ బ్యాకప్ కూడా చార్జి అయి సిద్ధంగా వుంటుంది. మొబైల్/ల్యాప్‌టాప్ లో బ్యాటరీ తగ్గినపుడు ఈ బ్యాకప్ నుండి ప్లగ్ సహాయం లేకుండానే చార్జింగ్ అవుతాయి.




స్వతహాగా బిడియంగా ఉండే అబిద్ కి కోకో, క్యారమ్ బోర్డు ఆటలు ఇష్టం. ఇతను హార్మోనియం, కాంగో డ్రమ్స్ కూడా వాయించగలడు. ఇతను పెద్దయ్యాక వ్యవసాయ పరిశోధకుడు అవ్వాలని అనుకుంటున్నాడు.

రోహిత్ పెద్దయ్యాక ఇంజనీర్ అవ్వాలని కోరుకుంటున్నాడు. ఇతనికి పుస్తకాలు, పత్రికలు చదవటం అంటే ఇష్టం. వాలీబాల్ బాగా ఆడతాడు.

## ఈత నేర్చుకునే వారికి ప్రాణరక్షణ పరికరం :

**సమరత్ సక్సేనా**, 6వ తరగతి మరియు **యతిరత్ సక్సేనా**, 10వ తరగతి, క్యాంపస్ పాఠశాల, పంత్ నగర్, ఉత్తరాఖండ్.



సక్సేనా సోదరులకి ఈ ఆలోచన వాళ్ళ మిత్రుడు ఈత కొలనులో ప్రమాద వశాత్తు మరణించినపుడు కలిగింది. తలకు ధరించే ఈ చిన్న పరికరం వలన నిర్ణీత కాలంకన్నా ఎక్కువసేపు ఎవరైనా నీటిలో ఉండిపోతే అది పైనున్న వారికి తెలియజేస్తుంది. వారు వెంటనే అతనిని

రక్షించే ఏర్పాట్లు చేయవచ్చు. ఇది ధరించిన వ్యక్తి నీటిలో ఎంతసేపు సురక్షితంగా ఉండగలడో అన్నదాని ఆధారంగా ఈ పరికరంలో మార్పులు చేసుకోవచ్చు.

చిన్నవాడైన సమరత్‌కి శాస్త్ర విషయాలంటే ఇష్టం. తనకు వచ్చిన ఆలోచనలన్నీ ఒక డైరీలో పొందుపరుస్తూ వుంటాడు. అన్న యతిరథ్‌కి 2009లో అతను రూపొందించిన త్రిభుజాకారంలో వుండే మెట్లమీదకి బరువును తీసుకువెళ్ళే పరికరానికి ఇగ్నైట్ బహుమానం అందించింది. ఇతను మంచి వక్తగా రూపుదాలుస్తున్నాడు. కంప్యూటర్లంటే ఇష్టం. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలి అనుకుంటున్నాడు.

## రైల్వే ప్లాట్‌ఫాంలపై ఆటోమేటిక్ రక్షణ కమ్మీలు :

**రాం నికాష్, 7వ తరగతి, ఎక్సెల్ సెంట్రల్ స్కూల్, కన్యాకుమారి, తమిళనాడు.**





నడుస్తున్న రైలు ఎక్కబోయి కిందపడిపోయి ప్రమాదం పాలైన సంఘటన చూసిన తర్వాత రాంనికేష్‌కి ఈ ఆలోచన వచ్చింది. రైలు వచ్చినప్పుడు, ప్లాట్‌ఫారం మీదనుండి రైలు బయలుదేరే ముందు రైలుకు, ప్లాట్‌ఫాం అంచుకి మధ్య రక్షణ కమ్మీలు ఆటోమేటిక్‌గా భూమిలోనుంచి లేచే ఏర్పాటు వుంటే నడుస్తున్న రైలును ఎవరూ ఎక్కే ప్రయత్నం చేయలేరు. మామూలుగా కూడా రైలు లేనప్పుడు పట్టాలు దాటే ప్రయత్నం చేయరు. దీనివలన ఎన్నో ప్రమాదాలను నివారించవచ్చు.

రాం నికాష్ కి 'ఎనిడ్ బ్లైటర్' నవలలన్నా, హాలీవుడ్ సినిమాలన్నా ఇష్టం. 'జర్మీ లీ రెన్నర్' నటించిన సినిమాలు తప్పకుండా చూస్తాడు. చదరంగం బాగా ఆడుతాడు. అంతరిక్ష శాస్త్రవేత్త అవాలనే కోరిక వుంది.

**స్కూలు, కాలేజి విద్యార్థులకు గ్రామీణ జ్ఞానం గురించి అవగతం చేయండి.**
**వారిని గ్రామ సమస్యలకు పరిష్కారాలను వెతకటంలో భాగస్వాములను చేయండి.**

Vol-3, Issue - 3 PALLE SRUJANA Nov.- Dec. 2014

## పాఠశాలల్లో, ఇతర ప్రదేశాలలో నీరు త్రాగే కుళాయిలు వాలుగా ఏర్పాటు చేయటం :

**ఛాయా సంభోజి ఠాకూర్, 7వ తరగతి, విద్యాధామ్, బోరూ ప్రైమరీ స్కూల్, గాంధీనగర్, గుజరాత్.**




తాను చదివే పాఠశాలలో చిన్న పిల్లలకి, పొట్టివారికి తాగడానికని ఏర్పాటు చేసిన మంచినీటి కుళాయిలు అందక పోవటం గమనించిన ఛాయా ఈ పైపులను సమాంతరంగా కాకుండా, కొంత పైనుండి కిందికి వాలుగా ఏర్పాటు చేస్తే వేరువేరు ఎత్తులలో వున్న పిల్లలందరికీ తాగటానికి సులవవుతుంది కదా అని ఆలోచించింది. ఈ ఆలోచన నచ్చి తన పాఠశాలలోనే కాక, ఇంకొన్ని పాఠశాలల్లో కూడా దీనిని అమలు పరిచారట.

ఛాయాకి ఇంగ్లీషు చదవటం, చిత్రలేఖనము, గోరింటాకు డిజైన్లలో, కోకో ఆడటంలో ఎంతో ఆసక్తి. పెద్దయ్యాక తనకు శాస్త్రవేత్తనై సమాజంలోని సమస్యలకు పరిష్కారాలు కనుగొంటాను అంటోంది.



## విద్యార్థులకు అబ్దుల్ కలాం గారి ఏడు సూత్రాల ప్రతిజ్ఞ

1. నేను నా జీవితానికి ఒక గమ్యం ఉండాలనుకొన్నాను. ఆ గమ్యాన్ని సాధించటం కోసం నేను జ్ఞానాన్ని సంపాదించాలి, కష్టపడి పనిచేయాలి, సమస్య ఎదురైనపుడు దానిని అధిగమించి, విజేతను కావాలి.
2. దేశ యువతగా నేను పనిచేస్తాను. నేను ధైర్యంగా పనిచేసి అన్నింటిలో విజయాలు సాధిస్తాను. ఇతరుల విజయాలలో కూడా పాలుపంచుకుంటాను.
3. ఎల్లప్పుడూ ముందుగా నేను, నా ఇల్లు, నా పరిసరాలు, నా చుట్టుప్రక్కల ప్రదేశాలు, పర్యావరణాన్ని శుభ్రంగా, చక్కగా వుంచుతాను.
4. గుండెల్లో ఋజువర్తనం వుంటే అది అందమైన నైతిక స్వభావానికి దారి తీస్తుందని తెలుసుకున్నాను. అందమైన నైతిక స్వభావం ఇంట్లో సామరస్యాన్ని కలిగిస్తుంది. ఇంట్లో సామరస్యం ఉంటే దేశంలో క్రమపద్ధతి వుంటుంది. దేశంలో క్రమపద్ధతి ప్రపంచ శాంతికి దోహదకారి అవుతుంది.
5. నేను అవినీతి లేని న్యాయబద్ధమైన జీవితం గడుపుతూ ఇతరులు, నా ఇంట్లో వున్నవారు కూడా అటువంటి ఋజువర్తన కలిగిన జీవితం గడపటానికి ఉదాహరణగా నిలుస్తాను.
6. దేశంలో నేను జ్ఞానజ్యోతిని వెలిగించి, అది ఎల్లప్పుడూ ప్రజ్వరిల్లుతూ వుండేలా చూస్తాను.
7. నేనేపని చేసినా ఉత్తమంగా చేయాలని నిర్ణయించుకున్నాను. 2020 నాటికి నా భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా చేయటానికి నావంతు పాత్రను పోషిస్తాను.



## మొబైల్ ఫోన్‌లో డయల్‌ని సూచించే పద్ధతి :

**జనీష్ షా, 8వ తరగతి, తపతి వ్యాలీ ఇంటర్‌నేషనల్ స్కూల్, సూరత్, గుజరాత్.**



చాలా సందర్భాలలో ఇద్దరు వ్యక్తులు సెల్‌ఫోన్‌లో మాట్లాడుకుంటున్నప్పుడు అకస్మాత్తుగా కాల్ డిస్‌కనెక్ట్ అయితే వెంటనే ఇద్దరూ ఒకరితో ఒకరు మాట్లాడటానికి తిరిగి డయల్ చేస్తూ వుంటారు. ఆ సందర్భంలో ఇద్దరికీ 'ఎంగేజ్' టోన్ వస్తూ వుంటుంది. ఇలా కాకుండా, అవతలి వ్యక్తి మీతో మాట్లాడటానికి మీకు డయల్ చేస్తున్నాడు అని మనకి తెలియజేసే పద్ధతి ఉంటే మనం అతనితో మాట్లాడే ప్రయత్నం మానేసి అతని కాల్ కోసం వేచియుంటాం. ఈ ఆలోచన జనీష్ షాకి ఒక రాత్రి క్లాస్ హోంవర్క్ చేసేటపుడు మిత్రునితో సంభాషించే సమయంలో ఈ సందర్భం వచ్చినపుడు వచ్చింది.

ఇతనికి చదువుతో పాటు ఆటలన్నా చాలా ఇష్టం. మరమనుషుల గురించి ఆసక్తి ఎక్కువ. ఇప్పటికే 4 భాషలు మాట్లాడగలిగిన ఇతను జర్మన్ ఫ్రెంచ్ కూడా

## ఒకే కాలున్న వ్యక్తి కూడా సులభంగా సైకిల్ తొక్కే సదుపాయం :

**శుభ డోలాకియా, 8వ తరగతి, శ్రీ జి.కె. డొలాకియా హైస్కూల్ (ఇంగ్లీష్), రాజ్‌కోట్, గుజరాత్.**

ఒక కాలు వున్న వ్యక్తులు కూడా సులభంగా సైకిలు నడపటానికి వీలుగా వుండేలా సైకిలుకు ఒక అదనపు పరికరాన్ని ఏర్పాటు చేస్తే బావుంటుందని ఇతని ఆలోచన. ఈ సాధనాన్ని సైకిల్ క్రాంక్‌కు అమరిస్తే సులువుగా వుంటుందని ఇతని భావన. ఒక అవిటి అతను కారు నడుపుతూ వుండగా చూసినప్పుడు ఇతనికి ఈ ఆలోచన వచ్చింది. అందరికీ కారు అందుబాటులో వుండరు, ఎక్కువగా వాడేది సైకిలు కనుక సైకిల్‌కి ఇటువంటి సదుపాయం ఉండాలని ఆలోచించాడు.



తనచుట్టూ వున్నవాటిని క్షుణ్ణంగా పరిశీలించే అలవాటున్న డోలాకియా పుస్తకాలు చదవటం క్రికెట్ ఆడటంతో పాటు కాగితాలతో బొమ్మలు తయారు చేయటం అలవాటు. పెద్దయ్యాక ఏరోనాటికల్ ఇంజనీర్ అవ్వాలనుకుంటున్నాడు.






"నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్" (ఎన్.ఐ.ఎఫ్.) తేనెటీగ తత్వంపై ఆధారపడి భారత ప్రభుత్వ సైన్స్ & టెక్నాలజీ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థ. ఇది "ఇగ్నైట్ జాతీయ పోటీలు" నిర్వహిస్తున్నది. ఇందులో 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు గాని, ఏ విద్యార్హతలు లేనివారు కూడా ఏ భాషలోనైనా తమ ఆలోచనలు, ఆవిష్కరణలను ఎన్.ఐ.ఎఫ్.కు 31 ఆగస్టు, 2015 లోగా పంపగోరడమైనది. దీనికి నిర్ణీత దరఖాస్తు నమూనా ఏదీ లేదు. అయితే మీరు పంపేటపుడు మీ ఆలోచన, ఆవిష్కరణ వివరాలతో పాటు మీ వయస్సు, చదువుతున్న తరగతి, పాఠశాల పేరు, ఇంటి చిరునామా, మిమ్మల్ని సంప్రదించవలసిన ఫోన్ నెంబరు తప్పనిసరిగా వ్రాయాలి. చివరి తేదీ తర్వాత అందిన దరఖాస్తులను తదుపరి 'ఇగ్నైట్-2015' పోటీలకి పరిశీలించడం జరుగుతుంది.

బాలల సృజనాత్మకత మరియు ఇన్నోవేషన్ దినంగా జరుపుకునే మన **మాజీ రాష్ట్రపతి శ్రీ ఎ.పి.జె. అబ్దుల్ కలామ్ గారి జన్మదినమైన 15 అక్టోబర్, 2015న విజేతలను ప్రకటించబడును.** ఎన్.ఐ.ఎఫ్. అవసరమైన సందర్భాలలో ఆలోచనలను మెరుగు పరచటానికి లేదా పేటెంట్ తీసుకోవటానికి కూడా తగిన సహాయం అందజేస్తుంది. ఎన్.ఐ.ఎఫ్. ఇంతకుముందే ఇగ్నైట్ పోటీలలో కొందరి పేరున పేటెంట్ హక్కులకై దరఖాస్తు చేయటం జరిగింది.

**మీ దరఖాస్తులను**

1. ఇమెయిల్ ignite15@nifindia.org ద్వారాగాని,
2. వెబ్‌సైట్ nifindia.org ద్వారా గాని,
3. క్రింద తెలిపిన చిరునామాకు గాని

**పంపవలసిందిగా కోరడమైనది.**

**దరఖాస్తులు చేరవలసిన చివరి తేది : 31 ఆగస్టు, 2015**

**దరఖాస్తులు పంపవలసిన చిరునామాలు**

**IGNITE 2015**
National Innovation Foundation - India
Satellite Complex, Premchand Nagar Road,
Jodhpur Tekra, Satellite
Ahmedabad 380 015, Gujarat

**Palle Srujana**
67, Vayupuri Colony,
Road No. 2, Sainikpuri Post,
Secunderabad - 500 094. A.P.
E-mail : honeybeeap@gmail.com
Phone : 040-27111959, 98660 01678

dst.gov.in honeybee.org sristi.org cbse.nic.in gian.org

# కేన్యా దేశపు ఇన్నోవేటర్ 'లియోనార్డ్ ముతిసియా'

**అభివృద్ధి చెందుతున్న మనదేశంలోని ఇన్నోవేటర్లని చాలామందిని 'పల్లెసృజన' ద్వారా పరిచయం చేశాం. ఇప్పుడు అంతగా అభివృద్ధి చెందని దేశంలోని ఒక ఇన్నోవేటర్ వివరాలను మీముందుంచుతున్నాం.**



ఆఫ్రికా ఖండంలోని తూర్పు ప్రాంతంలో వున్న దేశంలో అసంఘటిత రంగంలోని చిన్న చిన్న వ్యాపారులు పెద్ద పట్టణాలకి దగ్గరగా తమ వస్తువులను తయారు చేసుకుంటూ, అమ్ముకుంటూ వుంటారు. అట్లాంటి ప్రదేశాన్ని 'జువాకలీస్' అంటారక్కడ. వాళ్ళ భాష అయిన 'కుష్ వాలీస్'లో జువాకలీస్ అంటే మండుటెండ. చాలా కాలం క్రితం వరకు ఈ చిన్న వ్యాపారులంతా ఆరుబయట మండుటెండలోనే తమ వస్తువులని తయారు చేసుకుంటూ వుండేవారట. అందుకే ఆ పేరు వచ్చింది. ఈ జువాకలీస్ కేంద్రాలలో సాధారణంగా వ్యాపారులు ఇనుప వస్తువులు, మిషన్ పనులు, చెక్క పనులు, కార్ల రిపేర్లు, మెయింటెనెన్సు మొదలైనవి చేస్తూ వుంటారు. కొన్ని దుకాణాలలో రీసైకిల్ చేయబడ్డ రబ్బరు చెప్పులను కూడా అమ్ముతూ వుంటారు.

ఈ జువాకలీస్ కేంద్రాలు గణతంత్ర దేశానికి స్వరాజ్యం రాకముందునుంచి కూడా పనిచేస్తూ వన్నాయి. రాను రాను వీటి ప్రాచుర్యం పెరగసాగింది. క్రమేణా ఈ కేంద్రాలు తూర్పు ఆఫ్రికా దేశాలైన ఉగాండా, బరుండీ, రవాండా మొదలైన దేశాలకు కూడా విస్తరించాయి. చిన్న వ్యాపారస్తులకి జీవనోపాధి కల్పిస్తున్నాయి.

కేన్యా లోని 'మచాకోస్' అనే ప్రాంతంలో వున్న ఒక జువాకలీస్‌లో 'లియోనార్డ్ మతిసియా' చాలాకాలంగా పనిచేస్తున్నాడు. ఈ ప్రాంతంలోని వారికి ఆయన తయారు చేసిన గాలిమరలు, రంగుల రాట్నాల ద్వారా చిరపరిచితులయ్యారు. గత పది సంవత్సరాల్లో లియోనార్డ్ చాలా రకాల గాలిమరలు తయారు చేశాడు కానీ, కేవలం 13 మాత్రమే అమ్మగలిగాడు. తాను కరెంటు తయారు చేయటానికి గాలిమరలు తయారు చేస్తున్నాను కానీ, దాని మోటారుతో సమస్యలు వస్తున్నాయి. దానిని సరిచేయటానికి ప్రయత్నిస్తున్నాను అని చెప్పాడాయన.

1950లో జన్మించిన లియోనార్డ్ జువాకలీస్‌లో 1983లో చేరాడు. కొంతకాలం అక్కడ పనిచేశాక ఒకరోజు ఆయన గాలిమరల గురించిన ఒక కార్యక్రమం టీవీలో చూసి వాటిని కరెంటు తయారు చేయడానికి కూడా వాడవచ్చునని, దానితో వ్యాపారం కూడా చేయవచ్చునని చెప్పారట. అప్పటికే మెకానికల్‌గా కరెంటు తయారు చేయటంలో కొంత ప్రావీణ్యమున్న లియోనార్డ్ తన పనితనాన్ని గాలిమరల ద్వారా కరెంటు పుట్టించటానికి వినియోగించు కోవాలని నిర్ణయించుకున్నాడు.

అతను చేసిన మొదటి గాలిమర సైకిల్ విభాగాలు వాడి రూపొందించాడు. ఆరున్నర అడుగుల పొడవున్న మూడు రెక్కలతో దీనిని 1993లో తయారు చేశాడు. అది బాగానే పనిచేసినా, చాలా కొద్ది మొత్తంలో కరెంటు ఉత్పత్తి చేసింది. తర్వాత పది సంవత్సరాలలో ఆయన 4 నమూనాలను తయారు చేసి, చివరకు ఒక నమూనాను స్థిరపరిచాడు.

అతను చేసిన రెండవ నమూనా కారు బేరింగులు వాడి రూపొందించాడు. దీనితో రాపిడి చాలావరకు తగ్గి కొంత ఎక్కువ మోతాదులో కరెంటును ఉత్పత్తి చేసింది. దీనిలో ఆయన 4 రెక్కలను ఉపయోగించాడు. అయినా ఇంకా ఎక్కువ కరెంటు ఉత్పత్తి చేయాలన్న ఆలోచనతో 3వ నమూనా తయారు చేశాడు. ఈ నమూనాలో 6 రెక్కలుండి, చిన్నసైజు బేరింగులను వాడాడు. దీనిలో కరెంటు ఉత్పత్తి కొంత పెరిగినా ఆశించినంతగా లేదని భావించి ఆయన 4వ నమూనా రూపొందించాడు. దీనిలో ఆయన 8 రెక్కలను వాడాడు. ఈ నమూనాలో కరెంటు ఉత్పత్తి సంతృప్తిగా వుందని భావించాడు. కానీ తాను వాడిన మోటారు చాలా ఎక్కువ సామర్థ్యం కలిగింది అన్న ఆలోచనలో పడ్డాడు. 2004లో ఆయన అపోలో-5 గా నామకరణం చేసిన చివరి నమూనాను తయారు చేశాడు. ఇది కొంత తేలికగా వుండి, సంతృప్తికరంగా పనిచేసింది. ఈ రకం మరలు అతను 13 వరకు విక్రయించాడు. వినియోగించినవారంతా చాలా బావుందని మెచ్చుకున్నారు.

లియోనార్డ్‌కు మాత్రం సంతృప్తి కలగటం లేదు. దీనిని



ఇంకా అభివృద్ధి చేయాలన్న తలంపులో వున్నాడు. కరెంటు డిసి నుండి ఎసికి మార్చడంలో ఇబ్బందులు వస్తున్నాయని, దానిపైనే తాను చేపనిచేస్తున్నన్నానని చెప్పుకొచ్చాడు. ఈ విషయంలో తనకి ఎవరైనా సహాయం చేస్తారేమోనని ప్రయత్నిస్తున్నాడు. తనకి సహాయం చేసేవారు కూడా ఈ పరికరం ఎక్కువ మందికి చేరాలని, ఎక్కువమందికి మేలు చేయలనే ఆలోచన కలవారై ఉండాలని ఆయన కోరిక. తన సమస్య నలుగురికీ తెలిస్తే ఎవరైనా తనకి సహాయం చేయడానికి వస్తారేమోనని ఆయన ఆశ.

లియోనార్డ్ జువాకలీస్‌లో వస్తువులను తయారు చేయటంతో పాటు కొత్త కేంద్రాలలో డిసి నుండి ఎసికి కరెంటు మార్పిడి చేయటంపై మరియు ఇతర మెకానికల్ కరెంటు పరికరాలపై కొత్తవారికి వివరిస్తూ వుంటాడు. ఈ కేంద్రాలలో ఆయనకి చాలా మంచిపేరుంది.



నావద్దకు వచ్చినవారికి నేను నాకు తోచిన జ్ఞానాన్ని అందించగలుగుతున్నాను కానీ, నాదగ్గరికి వచ్చిన వారి దగ్గరనుండి నేనేమీ నేర్చుకోలేక పోతున్నాను అంటారాయన.

(ఎన్.ఐ.ఎఫ్.కి అనుబంధంగా వున్న సృష్టి సంస్థ తన కార్యకలాపాలని భారతదేశంలోనే కాక ఇతర దేశాలకి కూడా విస్తరించే ప్రయత్నంలో యు.ఎస్.ఎ.ఐ.డి. వారి ఆర్థిక సహాయంతో 1-10-2013 నుండి మూడు సంవత్సరాల వరకు చేపట్టిన కార్యక్రమంగా కెన్యా దేశానికి మొదటి విడతగా ఈ క్రింది మూడు పరికరాలను అందజేశాడు.

1. నారు నాటడానికి హనీబీ డబ్లర్.
2 సేద్యంలో సహాయం చేయడానికి 'బుల్లెట్ శాంతి'గా నామకరణం చేసిన హనీబీ టిల్లర్.
3. పంట చేతికి వచ్చిన తర్వాత ఉత్పత్తిని ప్రాసెసింగ్ చేయటానికి హనీబీ ఫుడ్ ప్రాసెసర్.

ఇంకా వివరాలు కావలసిన వారు

*visit http://www.sristi.org/cms/sristi-usaid*

## గ్రామీణ సృజనాత్మక శక్తికి వేదిక 'పల్లెసృజన'

'పల్లెసృజన' ఒక వేదికగా ఉపయోగపడాలంటే మీరు మీ సమస్యలను, ఆలోచనలను, జ్ఞాన సంపదను సంకోచించకుండా మాకు పంపండి. ఎంత చిన్న ఆలోచన అయినా సరే మేము ఆహ్వానిస్తాం. మీ సమస్యలను 'పల్లెసృజన'లో ప్రచురిస్తాం. వాటికి పాఠకులు సమాధానాలు పంపితే వాటిని కూడా ప్రచురిస్తాం. అందరూ సహకరించి ఈ గ్రామీణ సృజనాత్మక శక్తి వెలుగుదారుల వేదికను సద్వినియోగం చేసుకుంటారని ఆశిస్తున్నాం. **-ఎడిటర్**

**అంతరించిపోతున్న జీవరాసులను ముందు తరం వాళ్ళు చూడాలని మీరు కోరుకుంటున్నారా?**

# జ్ఞానయజ్ఞం


## పల్లె జ్ఞానాన్ని పల్లెలతో సంధానం చేయండి

**నలుగురికి మేలు చేయండిరా, మీకూ మేలు జరుగుతుందని పెద్దలు చెపుతూ వుంటారు. నలుగురికీ పనికివచ్చే పని చేస్తే మనకి మేలేమో కాని, ఎంత సంతృప్తి మిగులుతుందో చేసినవారికే తెలుస్తుంది. అనుభవించిన వారికి అవగతమౌతుంది.**

ఇప్పుడు 'పల్లెసృజన' నలుగురికే కాదు, నలభై మందికీ కాదు, నాలుగు వందల మందికి మేలు చేసే మార్గం, అవకాశం మీకు కల్పిస్తోంది. పర్వదినాలకి, పుట్టిన రోజులకి, వివాహాలకి మమ్మల్ని గుర్తుంచుకోండి అని ఏదో ఒక బహుమానం ఇవ్వటం మన ఆచారం. అదే బహుమానం ఇచ్చిన వారికే కాక, సమాజానికి కూడా ఉపయోగ పడితే, మీరిచ్చిన బహుమానం నాకే కాదు, ఇంకా ఎందరికో ఉపయోగ పడుతోంది అని వారు మనకు చెబితే ఆ ఆనందం మనకు ద్విగుణీకృత మవుతుంది. ఆ తృప్తికి మనకు అవధులు వుండవు.

మేము కోరేదల్లా మీకు తెలిసిన పర్వదినాల్లో ఇతరులకి పల్లెసృజన సభ్యత్వం కల్పించండి. మీకు తెలిసిన వారికి, ఆప్తులకి ఇవ్వండి. ఇంకొంచెం కొత్తగా ఆలోచించండి.....! మీరు పల్లెసృజన సభ్యత్వాన్ని గ్రామ పంచాయితీల పేరున ఇవ్వండి!! మీ స్వంత ఊరు, మీ మిత్రుల స్వంత ఊర్లలోని గ్రామ పంచాయితీల పేరున ఇవ్వండి!!! మీ కారణంగా అక్కడి ప్రజలు ఎంతోమంది గ్రామీణ ఇన్నోవేషన్లను గురించి తెలుసుకుంటారు. మీరు గ్రామాలను జ్ఞానంతో కనెక్ట్ చేసినవారవుతారు. అప్పుడు మీకు కలిగే తృప్తిని గురించి ఆలోచించండి. మీరు చేసిన ఈ చిన్న ఖర్చుకి మీకెంత ఫలితం వచ్చిందో ఎంత అమూల్యమైన చర్యో మీకే తెలుస్తుంది. ఒక గ్రామానికి రూ. 200 సంవత్సర సభ్యత్వం కట్టవలసి వస్తుంది. చందా వివరాలు ఈ సంచిక వెనక పేజీలో ఇవ్వబడ్డాయి.

ఈ కార్యక్రమాన్ని వెంటనే అమలు చేయండి, మన గ్రామీణ ఇన్నోవేషన్లను వెలుగులోకి తీసుకు వచ్చి, దేశాభ్యుదయానికి తోడ్పడండి. మన తెలుగు రాష్ట్రాల్లోని 30 వేల గ్రామాలను జ్ఞానంతో కనెక్టు చేయండి.




**మీరు చివరిసారిగా ఒక ఇన్నోవేటర్‌ని ఎప్పుడు కలిశారు?**

## సాంప్రదాయ పంటలు - నెల్లూరు జిల్లా వెంకటగిరిలో

# శొంఠిగింజల తయారీ

- నాగారెడ్డి శ్యాంసుందర్ రెడ్డి, పండ్లూరు, నెల్లూరు జిల్లా.

నెల్లూరు జిల్లా కేంద్రానికి దగ్గరలో వుంది వెంకటగిరి గ్రామం. సుందరమైన, పురాతనమైన 200 ఏళ్ళ చరిత్ర కలిగిన వెంకటగిరి రాజుల భవనాలతో, పడమటి వైపున దట్టమైన అడవి, కొండ ప్రాంతాలతో ఆహ్లాదకరమైన గ్రామం. వెంకటగిరి గ్రామం 'శొంఠి అన్నం' తయారీతో ఓ ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ ప్రక్రియ నాకు తెలిసి ఉభయ రాష్ట్రాల్లోగాని, దేశంలోగాని ఎక్కడా వున్నట్టు లేదని నా అభిప్రాయం.

కొన్ని వందల సంవత్సరాల నుండి వెంకటగిరిలో కొన్ని కుటుంబాలవారు తరతరాలుగా తయారు చేస్తున్నారు. అల్లంతో తయారయ్యే శొంఠికి, వీరు తయారు చేసే శొంఠికి సంబంధమే ఉండదు. వెంకటగిరి పట్టణానికి దగ్గరలోగల దట్టమైన అడవినుండి ఆ కుటుంబాలవారు సేకరించిన అనేక రకాల మూలికలతో చేసిన ఈ శొంఠి గింజ చిన్న నిమ్మకాయ సైజులో వుంటుంది.

ప్రతియేటా సెప్టెంబర్ నెలలో వెంకటగిరిలో జరిగే పోలేరమ్మ జాతరకు ఈ శొంఠి గింజలు తయారు చేస్తారు. వీటితో శొంఠి అన్నం తయారు చేసి పోలేరమ్మకు నైవేద్యంగా పెడతారు. మళ్ళీ తిరిగి సంక్రాంతికి ఈ అన్నాన్ని తయారు చేసి అమ్ముకుంటూ వుంటారు. కొందరు వ్యాపారస్తులు వీరివద్ద ఈ అన్నాన్ని కొని గ్రామాలలో తిరిగి అమ్ముకుంటూ వుంటారు.

**'శొంఠి అన్నం' తయారు చేసే పద్ధతి :**

పాత బియ్యాన్ని స్వచ్ఛమైన నీటితో వండి వార్చి, గడ్డలు లేకుండా అన్నాన్ని నలిపి బాగా చల్లార్చి ఈ శొంఠి గింజను చేతితో నలిపితే అది తేలికగా పొడిగా మారుతుంది. ఈ పొడిని అన్నంలో కొద్ది కొద్దిగా వేస్తూ వెడల్పాటి పాత్రలో అన్నంపై పోస్తూ 'పులిహోర' లాగా కలపాలి. అలా కలిపిన అన్నాన్ని ఒక కొత్త కుండలో పెట్టాలి. అయితే ఆ కుండలో అడవిలో లభించే 'గోంజి ఆకు'ను కుండ అడుగు భాగంలో పరిచి, దానిపై అన్నం పోసి పైన మళ్ళీ గోంజి ఆకుతో కప్పి కుండపైన ఒక గుడ్డను కట్టి మూత పెట్టాలి. దాన్ని ఒకచోట కదలకుండా వుంచి, మూడవ రోజు కుండను ముందుంచుకొని మూతను తీసి గుడ్డను విప్పితే ఇల్లంతా సువాసన వెదజల్లుతుంది. మూలిక చూర్ణం వలన అన్నం చెడిపోకుండా, దుర్వాసన రాకుండా హల్వాలాగా తయారవుతుంది. అందులో కొంత తెల్లగా నీరు కూడా తయారవుతుంది. ఈ అన్నాన్ని తింటుంటే మెత్తగా, తియ్య తియ్యగా గొంతులోకి దిగిపోతుంది.

అయితే ఈ వాసన కొందరికి నచ్చకపోవచ్చు. ఇది ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుందని తయారు చేసినవారు అంటూ వుంటారు. దీన్ని గురించి ఇంతవరకు ఏ పత్రికల వారూ వ్రాయలేదు. ఈ విషయాన్ని బైట ప్రపంచానికి తెలియజేయలేదు. ఈ శొంఠిగింజ అనేది మన భారతీయ మూలికల ప్రభావానికి ఒక తార్కాణంగా భావించవచ్చు. శొంఠి గింజల్లో ఉన్న ఈ ప్రభావాన్ని శాస్త్రజ్ఞులు విశ్లేషించి ప్రపంచానికి దీనిని విస్తరింపజేయాలి. ●

### శతమానం భవతి

**(వృద్ధుల జ్ఞానం 100 గ్రంథాలయాలతో సమానం)**

తాతయ్య, అమ్మమ్మ, నానమ్మల నుండి జ్ఞానానికి సంబంధించిన కబుర్లు మీరు వినడానికి ఎప్పుడైనా ప్రయత్నించారా? ఏకాగ్రతతో రెండు గంటలు వారితో గడపండి. వారి అనుభవాల పొరల్లో ఎంతో జ్ఞానం దాగివుంటుంది. ఆ కబుర్లను మాకు వ్రాసి పంపండి. ప్రచురణకు అనువైన వాటిని 'పల్లెసృజన'లో ప్రచురిస్తాం. వ్యాసాలను పంపేటప్పుడు మీ ఫొటోతో పాటు, మీకు కబుర్లు చెప్పిన వారి ఫొటోలను కూడా తప్పక పంపండి. ఈ అపూర్వ సాంప్రదాయ జ్ఞానాన్ని వెలుగులోకి తీసుకువచ్చి, భావి తరాలకు అందజేయటానికి మీ సహకారాన్ని కోరుతున్నాము. - ఎడిటర్.

**'పల్లెసృజన' సంఘం గురించి పది మందికి చెప్పండి, పత్రికకు చందా కట్టండి, కట్టించండి, పల్లెజ్ఞానాన్ని విస్తరింపజేయండి**




# 'పల్లెసృజన' ప్రగతి

✤ 150 మంది తెలుగు ఇన్నోవేటర్లను వెతికి, వెలుగులోకి తెచ్చి, వారి ఆవిష్కరణ లను, ఆలోచనలను ఎన్ఐఎఫ్‌లో రిజిష్టర్ లో చేయడం జరిగింది.

✤ ఇప్పటి వరకు 40 కళాశాలల్లో స్టూడెంట్ ఇన్నోవేషన్ క్లబ్బులను ప్రారంభించడం జరిగింది.

✤ 28 మంది ఇన్నోవేటర్లకు తమ ఇన్నోవేషన్లను కార్యరూపం చేయటానికి కావలసిన ఆర్థిక సహాయాన్ని అందించటం.

✤ 'పల్లెసృజన' ద్వారా గుంటూరు జిల్లావాసి సయ్యద్ సుభాని సృష్టించిన 'బూమ్ స్ప్రేయర్'ను లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు 2012లో రికార్డుగా నమోదు చేయడమైనది.

✤ అయిదవ జాతీయ పోటీల్లో బోయ రాజన్న, భూమయ్యాచారి, నజీర్ అహమ్మద్‌లకు జాతీయ బహుమతులు మార్చి 2012లో రాష్ట్రపతి ద్వారా ప్రదానం.

✤ "సివిల్‌సొసైటీ హాల్ ఆఫ్‌ఫేం" వారు 2011లో చింతకింది మల్లేశం, 2012లో పశువైద్యంలో చేసిన గ్రామీణ సేవలకు గుర్తింపుగా బోయ పెద్ద రాజన్నలను ఎంపిక చేయటం.

✤ దేశ వ్యాప్తంగా జరిగిన 'శ్యాంసంగ్ ఇన్నోవేషన్ల పోటీ'లలో చింతకింది మల్లేశం, తొండపి గురవయ్యలకు జాతీయ బహుమతులు, నగదు, 2011, 2012లో లభించడం.

✤ 'చైనా'లో డిసెంబర్, 2012లో జరిగిన 2వ అంతర్జాతీయ పునాదిస్థాయి ఇన్నోవేటర్ల సదస్సులో 'చింతకింది మల్లేశం' అతిథిగా పాల్గొనడం.

✤ 2013 మార్చిలో రాష్ట్రపతి ద్వారా గల్లా చంద్రశేఖర్, బోయ పెద్ద రాజన్న, బొమ్మగాని మల్లేశ్‌లు రాష్ట్రపతి భవనంలో జాతీయ బహుమతులు పొందడం.

✤ 2011 నుండి ఇప్పటివరకు 12 చిన్న శోధయాత్రలు వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్, ఖమ్మం, ఆదిలాబాద్, నల్గొండ, చిత్తూరు, మెదక్, శ్రీకాకుళం, కర్నూలు, రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో నిర్వహించడం.

✤ 13 మంది ఇన్నోవేటర్లకు పేటెంటు సంపాదించటం.

✤ 14 ఇన్నోవేషన్లు మార్కెట్‌లోకి రావడం.

✤ 30 లక్షల ఆర్థిక సహాయం గ్రామీణ ఇన్నోవేటర్లకు అందించడంలో కృతకృత్యులం కావాడం.

✤ "ఇన్నోవేషన్ల పరివ్యాప్తి కేంద్రం" సికింద్రాబాద్ లోని 'పల్లెసృజన' కార్యాలయంలో ఆగస్టు 2013 నుండి ఏర్పాటు చేసి, పాఠశాల, ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులను, రైతులను ఆహ్వానించడం

✤ ఐఐయం, ఐఐటి, బిట్స్ పిలాని, నారమ్, మిత్సుబిషి హెవీ ఇండస్ట్రీస్, జపాన్ నుండి యువకులు, విద్యార్థులు, 'ఇంటర్న్‌షిప్'కై పల్లెసృజనతో సంధానం చేయడం.

✤ పందిరి పుల్లారెడ్డి, గల్లా చంద్రశేఖర్, కడివిండి మహిపాల్ చారిలను డైరెక్టరేట్ ఆఫ్ ఆయిల్ సీడ్ రీసర్చ్ (డి.ఓ.ఆర్.) సంస్థ 28 ఫిబ్రవరి2014 న సత్కరించింది.

✤ మహీంద్ర సమృద్ధి జాతీయ అగ్రి అవార్డు 2014 "కృషి సహయోగ్" తో 'పల్లెసృజన'ను సత్కరించారు.

✤ చింతకింది మల్లేశం కథను కార్పోరేట్ లీడర్‌షిప్ ట్రెనింగ్ కోర్సులలో ప్రవేశపెట్టడం.

✤ ఇన్నోవేటర్ పందిరి పుల్లారెడ్డిని నల్గొండ జిల్లా కలెక్టర్ సభలో సత్కరించడం.

✤ ఆంధ్ర మహిళాసభ 'ఇన్ఫర్‌మేషన్ టెక్నాలజీ తొమ్మిది మంది ఎం.బి.ఏ. విద్యార్థులు 'పల్లెసృజన' ఇన్నోవేషన్లపై ఇంటర్న్‌షిప్ చేయటం.

✤ ముగ్గురు ఐఐఐటి, బాసర ఇంజనీరింగ్ విద్యార్థులు విక్రమ్ రాథోడ్ సైకిలు పంపును ఇంజనీరింగ్ పరంగా అభివృద్ధి చేయడం.

✤ ఇన్నోవేటర్ గోదాసునర్సింహకు 'రైతునేస్తం' సత్కారం.

✤ విజయవాడ పారిశ్రామికవేత్తలతో మహిపాల్‌చారి సంధానం.

✤ చంద్రశేఖర్ శ్రీశైలం కాళహస్తి పారిశ్రామికవేత్తతో మార్కెటింగ్ ఒప్పందం.

✤ ఎ.ఎస్.సి.ఐ. నుండి 106 మంది సైంటిస్టులు 'పల్లెసృజన'ను సందర్శించడం.

**మా కలలు :**

✤ తొమ్మిదవ ద్వైవార్షిక పోటీలకు వేయి ఎంట్రీలను ఆంధ్రప్రదేశ్ నుండి పంపడం.

✤ కనీసం ఆరుగురు తెలుగు గ్రామీణ ఆవిష్కర్తలకు రాష్ట్రపతి చేతులమీదుగా బహుమతి ఇప్పించడం.

✤ 2014లో పది పల్లెజ్ఞానవేత్తల ఇన్నోవేషన్లను మార్కెట్‌లోకి తేవడం.

✤ ఒక సంవత్సరం లోపు 'పల్లెసృజన'ను తెలుగు రాష్ట్రాల్లోని 30 వేల గ్రామాలకు అందించటం.

**మా కలలు నిజం కావాలంటే మీ సహకారం కావాలి.**

**ప్రోత్సహించండి - పాల్గొనండి - ఆవిష్కరించండి.**

- **బ్రిగేడియర్ పి. గణేశం**, అధ్యక్షులు,
పల్లెసృజన సంఘం.

# స్పందన

ఎడిటర్ గారికి నమస్కారములు,

మా నాన్నగారైన శ్రీ పి. బాలయ్య గారు సిర్‌పూర్ కాగజ్‌నగర్‌లో వుంటారు. 85 సంవత్సరాల వయసున్న స్వాతంత్ర్య సమర యోధుడు, ఆయన మొబైల్ నెంబర్ 93468 70896. ఆయన గ్రామీణ ఇన్నోవేటర్ పఠాన్ సైదా గారితో విండ్ మిల్‌ను గురించి మాట్లాడుతూ తన 3 ఎకరాల పొలంలో నీరు పారించటానికి విండ్‌మిల్‌ను ఏర్పాటు చేసే అవకాశాన్ని గురించి మాట్లాడుతుండటం చూసి నేను దిగ్భ్రాంతికి గురయ్యాను.

ఆయన గ్రామీణ ఇన్నోవేషన్లను ఇంత బాగా పట్టించుకోవటం చూసి 'పల్లెసృజన' ఎంతో మంచి పత్రిక అనిపించి నేను 8 మ్యాగజైన్లకు చందా ఏర్పాటు చేయడమైనది. అందులో ఒకటి మా నాన్నగారికి, మరొకటి మా సోదరుని కుమార్తె సాధన, 9వ తరగతి చదువుతోంది. మా నాన్నగారికి వ్యవసాయ సంబంధిత పత్రికల్లోని రైతుల విజయ గాథలు చదవడం ఎంతో ఇష్టం. సాధనకు సాంకేతిక పరిజ్ఞానాన్ని గురించి చదవడం ఇష్టం. వాళ్ళిద్దరూ ఒకరినొకరు ఇబ్బంది కలిగించుకోకుండా ఎవరికి నచ్చింది వారు చదువుకుంటూ వుంటారు. అందుకే వారికి ఈ పత్రిక అందేలా చేశాను. ఎందుకంటే ఈ పత్రికలో వారిద్దరికి కావాల్సిన సమాచారం సమృద్ధిగా వుంది అనిపించింది నాకు. అలాగే నేను కూడా 'పల్లెసృజన' పత్రికను నావద్ద కూడా ఒకటి పెట్టుకొని వుంటాను. నేను చెన్నయ్ నుంచి హైదరాబాద్‌కు వస్తుండగా రైలు ప్రయాణంలో ఒక వ్యక్తి తారసపడ్డాడు. ఆయన నెల్లూరు ఎన్.ఆర్.ఐ. ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ గారుట. నేను చదువుతున్న పల్లెసృజన పత్రికను అడిగి తీసుకుని చదివారు. చదివిన వెంటనే పత్రిక చాలా బాగుందని, పల్లెసృజన చాలా మంచిపని చేస్తోందని అభినందించారు. పత్రిక చిరునామా, ఫోన్ నెంబర్లను తీసుకున్నారు. వారు పల్లెసృజన యాజమాన్యాన్ని తమ కళాశాలకు ఆహ్వానించి తమ ఇంజనీరింగ్ విద్యార్థులతో ముఖాముఖి ఏర్పాటు చేయించాలనుకున్నారు.

ఎన్నో ఇన్నోవేషన్లు, జ్ఞానం, సంతోషకర వార్తలను ప్రచురిస్తున్న మిమ్ములను అభినందిస్తున్నాను. ఈ మంచి కార్యక్రమాలు ఇలాగే కొనసాగించాలని కోరుకుంటున్నాను. పల్లెసృజన యాజమాన్యానికి శుభాకాంక్షలు.

– **కైలాష్ కాంత్,** ఎస్.ఎం. (పి)/ఎల్.బి.పి., ఫోన్ : 94440 85723

ఎడిటర్ గారికి నమస్కారములు,

'పల్లెసృజన' పత్రికను గత 5 సంవత్సరాలుగా చదువుతున్నాను. ఎన్నో రకాల ఇన్నోవేషన్‌లను సమాజానికి, ముఖ్యంగా రైతాంగానికి పరిచయం చేస్తున్నందుకు ధన్యవాదములు. ఈ పత్రికలలో ముఖ్యంగా "ఎడిటోరియల్" నన్ను చాలా బాగా ఆకట్టుకుంది. ముఖ్యంగా ఇందులో ఎంచుకుంటున్న అంశాలు యధాతథంగా రైతాంగం మదిలో మెదిలేవే కావటం నాకెంతో ఆనందాన్నిస్తోంది. మీ భావాలకు నేను పూర్తిగా ఏకీభవిస్తున్నాను అని మనస్ఫూర్తిగా తెలియజేస్తున్నాను.

– **ఆర్. విజయభాస్కర రెడ్డి,** పులకుర్తి గ్రామం, కర్నూలు జిల్లా.

ఎడిటర్ గారికి,

'పల్లెసృజన' ఆగస్టు–సెప్టెంబర్ సంచిక చదువుతుంటే చాలా తృప్తిగా ఉంది. ముఖ్యంగా బోరుబావిలో ఊటను పెంచే ప్రయత్నం చేసిన గురుమూర్తి అభినందనీయులు. ఆలోచింపజేసే ఇలాంటి ఉత్తమ అంశాలను మాకు అందిస్తున్న 'పల్లెసృజన' సంపాదకవర్గానికి మా కృతజ్ఞతలు. – **భవనం జయరామి రెడ్డి,** 79 తాళ్ళూరు, గుంటూరు జిల్లా.

ఎడిటర్ గారికి,

నేను 45 రోజులుగా 'టైఫాయిడ్' జ్వరంతో బాధపడుతూ ఎంత మంది డాక్టర్లకు చూపించినా నయం కాలేదు. ఈ సమయంలో ఒక మిత్రుని ద్వారా 'పల్లెసృజన' వెలుగులోకి తెచ్చిన కర్నూలు జిల్లా ఆత్మకూరుకు చెందిన 'అద్భుత వైద్యుడు అబ్దుల్ కరీం' గురించి విని ఆయన వద్దకు వెళ్ళేనైనా నయమౌతుందేమో చూద్దామని అతి కష్టంమీద ఆత్మకూరుకు వెళ్ళడం జరిగింది. ఆయన '4 రోజులపాటు ఇక్కడే ఉండు నేను వైద్యం చేస్తాను' అన్నారు. సరేనన్నాను. మీరు చెప్పినది అక్షర సత్యమని నాకు తెలిసింది. 45 రోజులుగా నయం కాని నా వ్యాధి కేవలం 4 రోజుల్లోనే నయం చేసి నన్ను మామూలు మనిషిని చేశాడు అబ్దుల్ కరీం గారు. నా జబ్బును నయం చేసిన అబ్దుల్ కరీం గారికి, ఇలాంటి వైద్యుడ్ని సమాజానికి పరిచయం చేసిన 'పల్లెసృజన'కు ధన్యవాదములు. ఇలాంటి కార్యక్రమాలతో ఇంకా మున్ముందుకు సాగాలని మనసారా కోరుకుంటున్నాను. – **అహమ్మద్ హుసేన్,** కర్నూలు. ఫోన్ : 98852 84323.

# రైతులకోసం రైతులు కనిపెట్టిన సేంద్రియ క్రిమి సంహారక మందులు



## పంట ఏపుగా, ఆరోగ్యంగా పెరగటానికి (గ్రోత్ ప్రమోటర్)

ఈ మందు మొక్క అన్ని భాగాలు ఆరోగ్యంగా, ఏపుగా పెరగటానికి ఎంతో సమర్థవంతంగా పనిచేస్తుంది. సాధారణంగా మొక్కలో ఉండే పంట ఎదిగేందుకు దోహదకారియైన కణాలకు ఎటువంటి హాని తలపెట్టకుండా అవి ఇంకా సమర్థవంతంగా పనిచేయించి మొక్క ఎదుగుదలకు తోడ్పడుతుంది. ఈ మందు మొక్క వేర్లనుండి మొక్కకు కావలసిన ఆహారాన్ని క్రమ పద్ధతిలో అందడానికి దోహదపడుతుంది.

**మందు వివరాలు:**

బ్రాండు పేరు : సృష్టి శక్తి
క్యాటగిరి : వ్యవసాయ క్రిమి సంహారణ మందు
ఉపయోగం : గ్రోత్ ప్రమోషన్ (మొక్క ఎదుగుదల)
ప్యాకింగ్ సైజు : 500 మి.లీ.,
వాడే విధానం : ఒక లీటరు నీటిలో 6 మి.లీ. మందును కలిపి పంటపై మొక్క ఆసాంతం తడిచేలా పిచికారి చేయవలెను.




## పూత రాలుట నివారణకు మందు :

ఇది నూరుశాతం ప్రకృతి సహజ వనరులతో తయారు చేసిన సేంద్రియ క్రిమి సంహారిణి. ఇది అన్ని రకాల పంటలలో పూత రాలుటను నివారిస్తుంది. ఈ ఔషధము వృక్షాలకు, మొక్కలకు, వాణిజ్య పూల మొక్కలకు కూడా వాడవచ్చు. ఈ ఔషధము కూరగాయలు, మామిడి, జామ, అరటి, మల్లె పంటలలో పూత రాలుట నివారించటమే కాక, పంటల వృద్ధికి కూడా తోడ్పడుతుంది. పూత ఒత్తుగా రావటానికి తోడ్పడుతుంది. ఈ సేంద్రియ మందు వాడటం వలన ఇతర ఇబ్బందులు ఏమీ లేకుండా, తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఫలితాన్ని సాధించవచ్చు. ఈ మందు వినియోగ దారుల అవసరానికి తగ్గ మోతాదుల్లో లభిస్తుంది.

**మందు వివరాలు:**

బ్రాండు పేరు : సృష్టి ప్రయాస్
క్యాటగిరి : వ్యవసాయ క్రిమి సంహారక ఔషధం.
ఉపయోగం : పూత రాలుటను నివారిస్తూ అధిక దిగుబడికి తోడ్పడుతుంది.
ప్యాకింగ్ సైజు : 500 మి.లీ.
వాడే విధానం : ఒక లీటరు నీటిలో 5 మి.లీ. మందును కలిపి పంటపై పిచికారి చేయవలెను.

## కావలసినవారు సంప్రదించవలసిన చిరునామా :


**క్రియేటివ్ మైండ్స్, పల్లెసృజన కార్యాలయము, 67, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-27111959, సెల్ : 91777 52753**

PALLESRUJANA Telugu Bi-monthly 20/- Nov.-Dec. 2014 RNI No. APTEL 12136/01/01/2011-TC

# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

**ఒక్కో సంచిక రూ. 25/-లు మాత్రమే**











### చందా వివరాలు

| వివరములు | వ్యక్తిగతం | సంస్థ/లైబ్రరీ |
|---|---|---|
| సంవత్సరానికి | 200/- | 800/- |
| రెండు సంవత్సరాలకి (ఒక పాత సంచిక ఉచితం) | 350/- | 1,400/- |
| మూడు సంవత్సరాలకి (రెండు పాత సంచికలు ఉచితం) | 500/- | 2,000/- |
| ఐదు సంవత్సరాలకి (నాలుగు పాత సంచికలు ఉచితం) | 800/- | 3,200/- |

పల్లెసృజన చందాదారులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. చందాదారులుగా చేరాలనుకున్నవారు ఈ క్రింది చిరునామాకు మీ యం.ఓ.లు పంపండి. మీ చిరునామా స్పష్టంగా వ్రాయటం మరవకండి.

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్: 040-27111959, సెల్: 9866001678

E-mail : anchor@pallesrujana.org Visit us : www.pallesrujana.org

లేదా నేరుగా ఈ బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయండి.

మీ చిరునామాను స్పష్టంగా మాకు వ్రాసి పంపండి లేదా యస్.యం.యస్. లేదా ఇ-మెయిల్ చేయండి.

**M/s Pallesrujana, Syndicate Bank, Sainikpuri, Secunderabad.**
**SB A/c No. 30232200019150, IFS Code : SYNB0003023**

Narendra Grafix, Hyd. Ph.: 81257 9990